మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట





సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సంతోష్, పాల్గొన్న అధికారులు

### నెట్టెంపాడు ఎత్తిపోతల పథకం ద్వారా

# ఆయకట్టుకు నీరందించాలి:కలెక్టర్

**గద్వాల, అక్టోబరు 22, ప్రభాతవార్త:** నెట్టెంపాడు ఎత్తిపోతల పథకం ద్వారా ఆయకట్టుకు నీరు అందించే విధంగా నిలిచిపోయిన భూసేకరణ పనులను చేపట్టి వెంటనే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి.ఎం సంతోష్ సంబంధిత అధికారులను ఆదేశించారు.మంగళవారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారులతో భూసేకరణ పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నెట్టెంపాడు ఎత్తిపోతల పథకం కింద ప్యాకేజీ ,99,100 క్రింద మిగిలిపోయిన 488 ఎకరాలను సంబంధించిన భూసేకరణ పనులను వెంటనే పునరుద్ధరించి ఆయకట్టుకు నిరందించే విధంగా పనులను చేపట్టాలని ఆదేశించారు. చేపట్టిన పనుల పురోగతిపై నెల రోజుల తర్వాత తిరిగి సమీక్షించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ లక్ష్మీనారాయణ, భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసరావు, ఇరిగేషన్ ఈఈ రహీముద్దీన్, గద్వాల తహసిల్దార్ మల్లికార్జున్, ధరూర్ తహసీల్దార్ వెంకట్ రావు, ఇరిగేషన్ శాఖ డీఈ లు, ఏఈ లు సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఏసీబీ వలలో పుర కమిషనర్..

### పెండింగ్‌లో ఉన్న బిల్లులు ఇచ్చేందుకు పర్సంటేజ్‌కి డిమాండ్



ఏసీబీ వలకు చిక్కిన మున్సిపల్ కమిషనర్ ఆదిశేషు

**పెబ్బేరు అక్టోబరు 22 ప్రభాతవార్త :** పెబ్బేరు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం రోజు 12 గంటలకు పెబ్బేరు మున్సిపల్ కమిషనర్ ఆదిశేషు ఏసీబీకి చిక్కాడు. మున్సిపల్ జనరల్ ఫండ్స్ కింద 2023 సంవత్సరంలో 3,7,10 వార్డులలో జరిగిన పనులకు పెబ్బేరుకు సంబంధించిన కాంట్రాక్టర్ మూడు పనులను పూర్తి చేశాడు. ఈ మూడు బిల్లులు ఒక్కొక్క బిల్లు రూ.83వేల 930 రూపాయలు మూడుబిల్లులకు గాను రూ.2లక్షల50వేల బిల్లులకు పనులు చేసి సంవత్సరం కావస్తున్న ఇంతవరకు బిల్లులు కాలేదని కమిషనర్‌తో ఎన్నోసార్లు చెప్పుకున్న బిల్లులు రిలీజ్ చేయలేదని కాంట్రాక్టర్ వెల్లడించారు.ఇదే తరుణంలో కాంట్రాక్టర్ కమిషనర్‌ను సంప్రదించగా బిల్లులు కావాలంటే రూ.25వేలు ఇవ్వాలని లేకుంటే నాకు సంబంధం లేదని వ్యవహరించినట్లు కాంట్రాక్టర్ తెలిపాడు. ఆ క్రమంలో కాంట్రాక్టర్ రూ.20వేలు ఇస్తాను అని ఒప్పందం చేసుకొని కాంట్రాక్టర్ ఏసీబీ వాళ్లకు కంప్లైంట్ చేయడంతో ఏసీబీ వాళ్లు మంగళవారం రోజు పథకం ప్రకారమే 12 గంటలకు మున్సిపల్ ఆఫీసుకు చేరుకున్నారు. అదే సమయంలో కాంట్రాక్టర్ పెబ్బేర్ కమిషనర్‌కు రూ.20వేలు నగదు ఇస్తుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. అనంతరం కమిషనర్‌కు సంబంధించి హైదరాబాద్ వారి ఇంట్లో కూడా సోదాలు చేస్తున్నట్టు చెప్పారు. పుర కమిషనర్‌ను నాంపల్లి కోర్టులో హాజరు పరుస్తామని ఏసీబీ ,డిఎస్పీ బి కృష్ణ గౌడ్ తెలిపారు.

# 48గంటల్లో రైతుల ఖాతాలో ధాన్యం డబ్బులు..

### - రబీ సీజన్ నుంచి సన్నరకం ధాన్యంపై బోనస్, - దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూధన్‌రెడ్డి



ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్న ఎమ్మెల్యే జీఎంఆర్

**భూత్పూర్,అక్టోబరు 22,ప్రభాతవార్త :** రైతులు పండించిన వరి ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేసి 48గంటల్లోనే రైతుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పటిష్టమైన చర్యలు చేపట్టినట్లు దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూధన్‌రెడ్డి(జీఎంఆర్) స్పష్టం చేశారు.మంగళవారం ఎమ్మెల్యే జీఎంఆర్ భూత్పూర్ మండలం పాతమొల్గరలో వరికొనుగోలు కేంద్రాన్ని ప్రారం భించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారులు ధాన్యం సేకరణ ప్రక్రియను పకడ్బంధీగా చేపట్లాలని సూచించారు. రైతులు పండించిన వరిధాన్యానికి ప్రభుత్వం గ్రేడ్ ఎ రకానికి క్వింటాల్‌కు రు.2320గాను,సాధారణ రకానికి రు.2300లు మద్దతు ధరను నిర్ణయించినట్లు చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో రైతులు తాము పండించిన పంట కొనుగోలు కోసం కల్లాల వద్ద ఎదురు చూసేవారని,తమ ప్రభుత్వం 15రోజుల ముందుగానే వరికొనుగోలు కేంద్రాలు చేసిందని తెలిపారు.గత ప్రభుత్వ హయాంలో - మిగతా4లో..

# ముడా ఛైర్మన్ ప్రమాణ స్వీకార మహోత్సవానికి రండి..

### ఎమ్మెల్యే యెన్నంతో కలిసి మంత్రులకు ఆహ్వానం పలికిన ముడా ఛైర్మన్



మంత్రి శ్రీధర్ బాబుకు ఆహ్వానం పలుకుతున్న ముడా ఛైర్మన్, ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో,అక్టోబరు 22 ప్రభాతవార్త :** మహబూబ్‌నగర్ ముడా ఛైర్మన్ ప్రమాణ స్వీకార మహోత్సవం బుధవారం నిర్వహిస్తున్న సందర్భంగా కార్యక్రమానికి హాజరు కావాలని మంత్రులను కోరారు. మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో నూతన ముడా ఛైర్మన్ లక్ష్మణ్ యాదవ్ బుధవారం జరిగే మహబూబ్‌నగర్ ముడా ఛైర్మన్ ప్రమాణ స్వీకార మహోత్సవానికి హాజరు కావాలని తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ప్రాంగణంలో రాష్ట్రవైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ - మిగతా4లో..

# వసతులపై గళంమెత్తిన జేఎన్టీయూ విద్యార్థులు..

### విద్యార్థుల సమస్యలను పట్టించుకోని కాలేజ్ ప్రిన్సిపల్ వైస్ ప్రిన్సిపల్

### ఓకే భవనంలో గర్ల్స్ అండ్ బాయ్స్ వసతి నిర్వహణ

### గోపాల్పేట వెళ్లే రోడ్డుపై ధర్నాకు కూర్చున్న విద్యార్థులు



విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్డీఓ పద్మావతి, డీఎస్పీ వెంకటేశ్వరరావు

**వనపర్తి రూరల్ అక్టోబరు 22 ప్రభాతవార్త :** వనపర్తి జిల్లా నర్సింగాయపల్లి జేఎన్టీయూ కాలేజ్ విద్యార్థులు సమస్యలను పరిష్కరించాలి అని విద్యార్థులు ధర్నా చేపట్టారు. మంగళవారం వనపర్తి జిల్లా కేంద్రం, నర్సింగాయ పల్లి లోని జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు క్లాసులు బహిష్కరించి కళాశాల ఆవరణంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం రహదారిపై బైటాయించి నిరసన విద్యార్థులు తెలిపారు. జేఎన్టీయు ఇంజనీరింగ్ కళాశాల - మిగతా4లో..

# డబుల్ అక్రమాలపై నజర్..



- అనర్హులకు కేటాయించారంటూ కలెక్టర్‌కు ఫిర్యాదులు
- సమగ్ర విచారణకు ఆదేశం రంగంలోకి 15 మంది అధికారుల బృందం
- కదులుతున్న అక్రమార్కుల డొంక



డబుల్ బెడ్‌రూం ఇండ్లు

**మహబూబ్‌నగర్ బ్యూరో,అక్టోబరు 22 ప్రభాతవార్త :** అక్రమార్కుల డొంక కదులుతుంది. గతంలో కేటాయించిన డబుల్ బెడ్‌రూం ఇండ్ల పథకంలో జరిగిన అ క్రమాలపై విచారణకు రంగం సిద్ధమైంది. గత ప్రభుత్వ హయాంలో డబుల్ బెడ్‌రూం ఇండ్ల కేటాయింపులో అవకతవకలు జరిగాయంటూ కలెక్టర్‌కు పలుమార్లు పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందడంతో విచారణకు ఆదేశించారు. మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలో డబుల్ బెడ్‌రూం ఇండ్ల కేటాయింపులో అక్రమాలు, అవకతవకలు జరిగినట్లు వచ్చిన ఆరోపణలు, ఫిర్యాదులపై జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి సమగ్ర తుది విచారణకు 15 మంది అధికారులను నియమించారు. 15 మంది అధికారులు నేటి నుండి ఇంటింటికి తిరిగి సమగ్ర తుది విచారణ చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు.

**మహబూబ్‌నగర్‌లో ఇండ్ల కేటాయింపు ఇలా...**

మహబూబ్‌నగర్ నియోజకవర్గ పరిధిలో సుమారు రెండు వేల ఇండ్ల వరకు గత ప్రభుత్వ హాయంలో లబ్దిదారులకు కేటాయించడం జరిగింది. అయితే అర్హులకు కాకుండా తమకు అనుకూలంగా ఉన్నవారికి, నాయకులకు, అప్పటికే ఇండ్లు ఉండి వివిధ హోదాల్లో ఉన్నవారికి సైతం డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు కేటాయింపు జరిగిందని కలెక్టర్‌కు ఫిర్యాదులు అందాయి. ఈ క్రమంలో మహబూబ్‌నగర్ నియోజకవర్గ పరిధిలో ఏ ప్రాంతంలో ఎన్ని ఇండ్లు పూర్తయ్యాయి, ఎన్ని ఇండ్లు కేటాయించారు తదితర విషయాలపై పూర్తిస్థాయిలో విచారణ జరగనున్నది. మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలో దివిటిపల్లిలో 1024, వీరన్నపేటలో 660, క్రిస్టియన్‌పల్లిలో 310 మొత్తం 1994 ఇండ్లు నిర్మాణం చేసి లబ్దిదారులకు కేటాయింపు చేయడం జరిగింది. డబుల్ బెడ్‌రూం ఇండ్ల కేటాయింపుపై అనేకమైన ఫిర్యాదులు జిల్లా కలెక్టర్‌కు వచ్చాయి. ఇందులో అనర్హులకు, స్థానికేతరులకు, ఒకరికి కేటాయింపు చేసిన ఇంటిలో వేరేవారు అక్రమంగా నివాసం ఉండడం, ప్రభుత్వ, ప్రైవేట్, రిటైర్డ్ ఉద్యోగులకు కేటాయింపు చేశారన్న ఆరోపణలు, అర్హులైన నిరుపేదలకు కేటాయింపు జరగకుండా అనర్హులకు కేటాయింపు చేశారని నిరుపేదలు జిల్లా కలెక్టర్‌కు దరఖాస్తులు చేశారు. ప్రభుత్వం గృహ నిర్మాణ శాఖ ద్వారా ప్రభుత్వ ఉత్తర్వులు నంబర్ 4,10,12ల జారీ చేసిన మార్గదర్శకాలు, నిబంధనలు పాటించకుండా కేటాయింపు చేశారని ప్రధాన ఆరోపణ. ఈ ఆరోపణలు, ఫిర్యాదులపై గతంలో నిర్వహించిన ప్రాథమిక విచారణలో అనర్హులకు కేటాయింపు జరిగినట్లు ఆధారాలు లభించాయి. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ డబుల్ బెడ్‌రూం ఇండ్ల కేటాయింపు చేసిన లబ్దిదారుల అర్హతపై తుది విచారణకు ఆదేశించారు. ఇప్పటికే ఏనుగొండకు సంబంధించిన 588 ఇండ్ల లబ్దిదారుల అర్హతపై విచారణ పూర్తయింది. జిల్లా కలెక్టర్ నియమించిన 15 మంది అధికారులు బుధవారం నుండి ఇంటింటికి తిరిగి సమగ్ర విచారణ నిర్వహించి జిల్లా కలెక్టర్‌కు తుది నివేదిక సమర్పిస్తారని తెలిపారు.

# డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం..

### మత్తుతో జీవితాలు చిత్తు చేసుకోవద్దు

### మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి

### జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఎస్పీ యోగేష్ గౌతమ్



మాట్లాడుతున్న ఎస్పీ యోగేష్ గౌతమ్



జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న దృశ్యం

**నారాయణపేట టౌన్,అక్టోబరు 22 ప్రభాతవార్త :** డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించేందుకు యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి ఉజ్వల భవిష్యత్తు కోసం బాటలు వేసుకోవాలని జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లాలోని కోస్గి పట్టణంలోని స్టేడియం గ్రౌండ్‌లో జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్ర రవాణా వ్యతిరేక అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మాదక ద్రవ్యాల నిరోధానికి ఎంతో ప్రాముఖ్యతను తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతినెల జిల్లా కలెక్టరేట్‌లో డ్రగ్స్ నిరోధంపై జిల్లాస్థాయి అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. యాంటీ డ్రగ్స్ కార్యక్రమాల్లో భాగంగానే జిల్లాలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించడం జరుగుతుందని, మొదటగా కోస్గిలోనే ఈ అవగాహన సదస్సును ఏర్పాటు చేయడం జరిగిందని ఆమె తెలిపారు. మన జిల్లాలో డ్రగ్స్ ప్రభావం అంతగా లేకున్నా, హైదరాబాద్ లాంటి మహానగరం ప్రభావం పట్టణ ప్రాంతాలపై ఉంటుందని, డ్రగ్స్ మహమ్మారిని ప్రారంభ దేశంలోనే గుర్తించి నిర్మూలించాల్సిన అవసరం ఉందన్నారు. డ్రగ్స్ విక్రయదారులు యువతనే లక్ష్యంగా చేసుకుని తమ కార్యకలాపాలను కొనసాగిస్తారని, దీనిపై యువత చైతన్యం కలిగి ఉండాలన్నారు. మన పరిసరాలలో ఎవరైనా డ్రగ్స్ విక్రయిస్తున్నారని తెలిస్తే సామాజిక బాధ్యతగా అధికారులకు సమాచారం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలోని అన్ని కళాశాలలో ఏర్పాటు చేసిన యాంటీ డ్రగ్స్ క్లబ్‌లు సమర్థవంతంగా పని చేయాలని కలెక్టర్ సూచించారు. జిల్లాతో పాటు, కొడంగల్ నియోజకవర్గం కూడా డ్రగ్స్ నిషేధిత ప్రాంతాలుగా మార్చేందుకు - మిగతా4లో..

### దేశభక్తి పెంపొందించడానికి

# ఓపెన్ హౌస్ ప్రారంభం..

### మహబూబ్‌నగర్ ఎస్పీ డి.జానకి



ఆయుధాల ప్రదర్శనను తిలకిస్తున్న విద్యార్థులు

**మహబూబ్‌నగర్ బ్యూరో,అక్టోబరు 22 ప్రభాతవార్త :** పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా మహబూబ్‌నగర్ జిల్లా పోలీస్ కవాతు మైదానంలో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని ఎస్పీ డి. జానకి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖ నిర్వహణ, సిబ్బంది విధులు, ఉపయోగించే ఆయుధాలు, వాహనాలు, ఇతర సాంకేతిక పరికరాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ, వారి సేవలను ప్రజలు గుర్తు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని పోలీసు శాఖపై తమ ఆసక్తిని వ్యక్తం చేశారు. ఇలాంటి ఓపెన్ హౌస్ కార్యక్రమాలు ప్రజలు, ముఖ్యంగా యువతలో దేశభక్తి భావాన్ని పెంపొందించేందుకు, పోలీస్ శాఖపై అవగాహనను పెంచేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో పోలీస్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# స్వయం ఉపాధి అవకాశాల కల్పనే ధ్యేయం..

### పోలీసు రిక్రూట్‌మెంట్ ట్రైనింగ్, ఆర్మీ ట్రైనింగ్ సెంటర్లను ఏర్పాటు




సదస్సులో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లు రవి

**గద్వాల, అక్టోబరు 22 ప్రభాతవార్త:** స్థానిక యువతకు బ్యాంకులు రుణాలు అందించే ప్రక్రియ వేగవంతం, నిరుద్యోగ యువతను వ్యాపారవేత్తలుగా మార్చే విధంగా ప్రణాళిక రూపొందిస్తున్నట్లు నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి అన్నారు. పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో ఎస్సీ, ఎస్టీ హబ్ సెల్ ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. దేశంలోనే మొదటిసారిగా నాగర్‌కర్నూల్ జిల్లాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేసినట్లు నాగర్‌కర్నూల్ పార్లమెంటు సభ్యుడు డాక్టర్ మల్లు రవి అన్నారు. నాగర్‌కర్నూల్ పట్టణంలోని తేజ కన్వెన్షన్ హాల్ నందు నాగర్‌కర్నూల్ పార్లమెంటు పరిధిలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళవారం పార్లమెంటు పరిధిలోని సూక్ష్మ, చిన్న మధ్య తరహా పరిశ్రమల ద్వారా నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి, ఆర్థిక అభివృద్ధి, వవారి ప్రాంతాలకు ఎలాంటి పరిశ్రమలు నిర్మించుకోవాలి అనే అంశాల మీద అవగాహన సదస్సును ఎంపీ డాక్టర్ మల్లు రవి, మంత్రి జూపల్లి కృష్ణరావుతో కలిసి ఎమ్మెల్సీ, జిల్లా కలెక్టర్లు, ఎమ్మెల్యేలు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి నాగర్‌కర్నూల్ పార్లమెంటు సభ్యుడు డాక్టర్ మల్లు రవి మాట్లాడుతూ ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలలో ఎస్సీ, ఎస్టీ, బీసీ బడుగు బలహీన వర్గాల యువతకు ఉపాధి అవకాశాలను కల్పించాలన్న లక్ష్యంతో దేశంలోని వివిధ ప్రముఖ ప్రభుత్వ రంగ సంస్థల ప్రతినిధులతో స్థానిక ఎన్జీవో సంస్థ అవార్డు సహకారంతో అవగాహన సదస్సును నిర్వహించడం జరిగిందని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా అమలు అయ్యే అన్ని రకాల సంక్షేమ పథకాలను నాగర్‌కర్నూల్ పార్లమెంటరీ నియోజకవర్గం ప్రజలు ఉపాధి అవకాశాలను పెంపోందించుకునే విధంగా అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని, దేశంలోని వివిధ రకాల బ్యాంకులో అందిస్తున్న రుణాలు సబ్సిడీలు ప్రజలకు తెలిసే విధంగా బ్యాంకు అధికారులచే స్థానిక యువతకు అవగాహన కల్పించామని తెలిపారు. యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించడానికి దేశంలోని వివిధ రకాల సంస్థలు పరిశ్రమల అధికారులను నాగర్‌కర్నూల్ జిల్లాలో జరిగిన నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాల అవగాహన సదస్సుకు హాజరయ్యారు. సూక్ష్మ చిన్న తరహా మధ్య తరహా పరిశ్రమలను స్థాపించడానికి కావలసిన వనరులు నైపుణ్యా లు పెట్టుబడి పలు అంశాలపై ఈ కార్యక్రమంలో అవగాహన కల్పించారు. వివిధ రకాల బ్యాంకుల అందిస్తున్న రుణాలు సబ్సిడీలు ప్రజలకు తెలిసే విధంగా బ్యాంకు అధికారులచే స్థానిక యువతకు అవగాహన కల్పించామని తెలిపారు. యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు అవగాహన సదస్సుకు హాజరయ్యారు. సూక్ష్మ చిన్న తరహా మధ్య తరహా పరిశ్రమలను స్థాపించడానికి కావలసిన వనరులు నైపుణ్యాలు పెట్టుబడి పలు అంశాలపై ఈ కార్యక్రమంలో అవగాహన కల్పించారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నిరుద్యోగ యువతను వ్యాపారవేత్తలుగా మార్చే విధంగా మూడు జిల్లాల కలెక్టర్ల సహాయ సహకారాలు అందించాలని కోరారు. నెల రోజుల తర్వాత డిసిసిబి బ్యాంకు అధ్వర్యంలో 150 కోట్ల రూపాయలతో నాగర్‌కర్నూల్ లో లోన్ మేళా నిర్వహించనునట్లు ఈ సందర్భంగా తెలిపారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి పెద్ద ఎత్తున యువత హాజరయ్యారు. విద్యా జ్ఞానంతో పాటు అంతర్జాతీయ నైపుణ్య అవకాశాలను అందిపుచ్చుకోవాలి. 50 లక్షల సొంత నిధులతో నిరుద్యోగ యువతకు సమాచార దీపిక, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ల ఏర్పాటు రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు , నిరుద్యోగ యువతకు ఇంత పెద్ద స్థాయిలో ఏర్పాటు చేసిన పార్లమెంటు సభ్యులు డాక్టర్ మల్లు రవిని మంత్రి జూపల్లి కృష్ణరావు ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ విద్య నైపుణ్యంతో పాటు అంతర్జాతీయ విద్య నైపుణ్యంతో పాటు అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో యువత స్వయం ఉపాధి లక్ష్యంగా కృషి చేయాలని మంత్రి అన్నారు. ప్రతి యువతి యువకులు విద్యా జ్ఞానంతో పాటు అంతర్జాతీయ నైపుణ్య అవకాశాలను పొందుపరుచుకోవడం ప్రస్తుత ఎంతో అవశ్యకత ఉందని మంత్రి తెలిపారు. ప్రభుత్వ రంగంలో వంద మందికి ఒక్కరికి ప్రభుత్వ ఉద్యోగం అంటే ప్రైవేట్ రంగంలో 99 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించే అవకాశాలు ఉన్నట్లు మంత్రి స్పష్టం చేశారు. ప్రతి కలెక్టర్ కార్యాలయంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలు, వివిధ సంస్థల ప్రైవేట్ రంగాల్లో యువతకు నైపుణ్య అవకాశాలు, శిక్షణ, అవగాహన కనిపించేందుకు ప్రత్యేక హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేయాలని కలెక్టర్లను మంత్రి ఆదేశించారు. ఈ సమావేశంలో ఎంఎల్‌సి దామోదర్ రెడ్డి, అచ్చంపేట ఎమ్మెల్యే డా.వంశీకృష్ణ, వనపర్తి ఎమ్మెలల్యే తూడి మేఘారెడ్డి, కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా డిసిసిబి చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్ రెడ్డి, మైనార్టీ ఫైనాన్స్ కార్పోరేషన్ చైర్మన్ కొత్వాల్, నాగర్‌కర్నూల్ వనపర్తి కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు , అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మద్దిగట్ల చెరువులో చేపపిల్లల్ని వదిలిన ఎమ్మెల్యే

**భూత్పూర్, అక్టోబరు 22, ప్రభాతవార్త :** భూత్పూర్ మండలం మద్దిగట్ల, పాతమొల్గర చెర్వులలో దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూధన్ రెడ్డి (జీఎంఆర్) మంగళవారం ప్రభుత్వం పంపిణీ చేసిన చేపపిల్లల్ని వదిలారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీఎంఆర్ మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో ప్రజాపాలనను సాగిస్తోందని, రాష్ట్రంలో అసలైన ప్రజా స్వామ్య పాలన సాగుతోందని పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మత్స్యకారులు



మద్దిగట్ల చెర్వులో చేపపిల్లల్ని వదులుతున్న ఎమ్మెల్యే జీఎంఆర్ ఇతర నాయకులు

చేప విత్తనాల కోసం ఎదురు చూసే వారని, కానీ నేడు ఆ పరిస్థితి రాకుండా మత్స్యకారులు అడగకుండానే ప్రభుత్వం చేప విత్తనాలను రాష్ట్ర మత్స్యశాఖ నుంచి సిద్ధం చేసినట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపపిల్లల పంపిణీని పెద్దఎత్తున ఎంతో ప్రతిష్టాత్మకంగాను, పకడ్బంధీగాను చేపట్టిం దన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపిపి కదిరే శేఖర్‌రెడ్డితో పాటు నాయకులు హరియా నాయక్, దెంది లక్ష్మీకాంత్‌రెడ్డి, నర్సింహులు, తమన్నగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనులను పరిశీలించిన కేంద్ర బృందం సభ్యులు

**ఖిల్లాఘణపురం అక్టోబరు 22 ప్రభాతవార్త :** మండల పరిధిలోని సలికలాపూర్ గ్రామంలో జాతీయ ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పలు పనులను కేంద్ర బృందం సభ్యులు ఎం దేశ్‌పాండే, పి.బి పాటిల్ మం గళవారం పరిశీలించారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా గ్రామాలలో చేపట్టిన సిసి రోడ్డు పనులు, రైతు వేదికలు, స్మశానవాటికలు, డంపింగ్ యార్డ్‌లను పరిశీ లించారు. అనంతరం గ్రామం లో వస్తున్న పింఛన్లతో పాటు మహిళా గ్రూపులు ఎన్ని ఉన్నాయి. వాటిలో సభ్యులదం రూ ఉన్నారా అని పరిశీలించారు. ఉపాధి హామీ పథకంలో చేపడుతున్న భూమి, చదరపు పను లు పరిశీలించారు. కేంద్ర ప్రభుత్వం అందజేసే పథకాలను గ్రామీణ ప్రజలు రైతులు మహిళా సంఘాల వారు వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ నగేష్ పంచాయతీ కార్యదర్శి లియాఖత్ పలువురు మహిళలు రైతు సంఘాల నేతలు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## పెండింగ్ డీఏలు ఇవ్వాలి..పీఆర్సీ ప్రకటించాలి..

### నల్లబ్యాడ్జీల నరసనతో తపస్ డిమాండ్

**నారాయణపేట టౌన్, అక్టోబరు 22 ప్రభాతవార్త :** పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర శాఖ పిలుపు మేరకు మంగళవారం నారాయణపేట మండలం, కోటకొండ తదితర పాఠశాల స్థాయిలో నల్లబ్యాడ్జీల నిరసన కార్యక్రమాన్ని చేపటారు. ఈ సందర్భంగా జిల్లా



నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న దృశ్యం

ప్రధాన కార్యదర్శి నరసింహ, మండల అధ్యక్ష, కార్యదర్శులు విశ్వనాథరెడ్డి, చిన్న నరసింహులు మాట్లాడుతూ ఉపాధ్యాయ పదోన్నతులు, బదిలీలు చేపట్టడం, నూతన నియామకాలు వెంటనే పూర్తి చేయడం ఎంతో అభినందనీయమే కాని ఉపాధ్యాయ ఉద్యోగులకు హక్కుగా రావలసిన డిఎలు, పిఆర్సీని గతంలో ఎన్నడూ లేని విధంగా చేయడం ఎంతో అభినందనీయమని కానీ ఉపాధ్యాయ, ఉద్యోగులకు హక్కుగా రావాలసిన డిఏలు, పిఆర్సీని గతంలో ఎన్నడూ లేనివిధంగా జాప్యం చేయడం పట్ల తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆయాపాఠశాలల ప్రధానోపాధ్యాయులు తపస్ నాయకులు సీతారాములు, శంకర్‌నాయక్, రవికుమార్, శ్యామ్, అశోక్, శ్రీనివాస్, అంబర్నాథ్, కేశవ్, వెంకటేష్, కృష్ణారెడ్డి, మల్లేష్, ఉమ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

**కొత్తకోట అక్టోబరు 22 ప్రభాతవార్త :** గత కొన్ని సంవత్సరాలుగా పారిశుద్ధ్య కార్మికులుగా పని చేస్తున్న మున్సిపల్ కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం పర్మినెంట్ చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బొబ్బిలి నిక్సన్ డిమాండ్ చేశారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మా



కార్మికులతో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

ట్లాడుతూ ఈనెల 25వతేదీన పారిశుద్ధ్య కార్మికులు పోరుబాట పట్టారని హైదరాబాదులో సిడిఎంఏ కార్యాలయము వద్ద ధర్నా కార్యక్రమం ఉంటుందని మున్సిపల్ కార్మికులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. మున్సిపల్ కార్మికులకు కనీసవేతనము నెలకు 26,000 ఇవ్వాలని ఉద్యోగ భద్రత కల్పించి పిఎఫ్ ఈఎస్ సౌకర్యం కల్పించాలని కోరారు. కొత్త ప్రభుత్వం పై మున్సిపల్ కార్మికులు కోటి ఆశలు పెట్టుకున్నారని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కే కృపయ్య, కురుమన్న, కొండన్న, పెద్దరాజు, శేఖర్, ఎర్రన్న, సుశీలమ్మ, సుగుణమ్మ, శిరీష, దివ్య, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

**ఆత్మకూరు అక్టోబరు 22 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం పేదలకు అందజేస్తున్నటువంటి సంక్షేమ పథకాలను సద్వినియోగపర్చుకోవాలని ఆత్మకూరు ఎంపీఓ శ్రీరామ్ రెడ్డి సూచించారు. మంగళవారం రోజు ఆత్మకూరు మండలంలోని పిన్నంచర్ల గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్నటువంటి మహాలక్ష్మి గ్యాస్ సిలిండర్లా ప్రోసీడింగ్స్ కాపీలను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల



పిన్నంచర్ల గ్రామంలో సబ్సిడీ పత్రాలను అందజేస్తున్న ఎంపీఓ

సమయంలో ప్రకటించిన విధంగా ఆరు గ్యారెంటీ పథకాల అమలులో చేసేందుకుగాను కృతనిశ్చయంతో పని చేస్తుందని అందులో భాగంగానే రూపాయలు 500 కే సిలిండర్ పథకాన్ని అందజేసేందుకు ప్రభుత్వం సబ్సిడీ పత్రాలను అందజేస్తున్నట్లుగా ఆయన తెలిపారు. మఖ్తల్ శాసనసభ్యులు వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు మంగళవారం గ్రామంలో ప్రత్యేక సమావేశం నిర్వహించి పథకాలను అందజేస్తున్నట్లుగా ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాముల కాంగ్రెస్ నాయకులు కాజన్న ,హరీష్ గౌడ్, వెంకటన్న తదితరులతో పాటుగా పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎస్సైని సన్మానిస్తున్న పార్టీల నేతలు

**ఉప్పునుంతల, అక్టోబరు 22 ప్రభాతవార్త :** ఉప్పునుంతల ఎస్సైగా వెంకటరెడ్డి చారగొండ నుండి బదిలీపై ఇటీవల ఉప్పునుంతల ఎస్సైగా బాధ్యతలు చేపట్టడంతో వివిధ పార్టీల నాయకులు శాలువాలు, పూల మాలలతో ఘనంగా సన్మానించారు. మంగళవారం బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు కొత్త రవిందర్‌రావు ఆధ్వర్యంలో ఎస్సైని శాలువాలు కప్పి, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. సన్మానించిన వారిలో బిఆర్ఎస్




ఎస్సైకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న గిరిజన సోదరులు

మండల పార్టీ అధ్యక్షుడు కొత్త రవిందర్‌రావుతో పాటు, అచ్చంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ కట్ట గోపాల్‌రెడ్డి, తాడూరు కృష్ణయ్య, ఉమామహేశ్వర దేవస్థానం కమిటి మాజీ డైరెక్టర్ సిహెచ్ సుధాకర్, చింతకాయల మల్లయ్య, పరశురాములు, తదితరులున్నారు.

**ఎస్సైని సన్మానించిన గిరిజన సోదరులు...** మండలంలోని దేవదారికుంట తండాకు చెందిన కాంగ్రెస్ పార్టీ శ్రేణులు గిరిజన సోదరులు బుధవారం ఎసైని శాలువాలతో ఘనంగా సన్మా నించారు. ఈసన్మాన కార్యక్రమంలో మాజీ జైపాల్ నాయక్, ఎస్టీ సెల్ అధ్యక్షులు రాందాస్ నాయక్, శ్రీనునాయక్, రమేష్‌నాయక్, యూత్ అధ్యక్షులు మాత్రునాయక్, మధునాయక్ తదితరులు పాల్గొన్నారు.

### ఉప్పునుంతల నుంచి కొత్త రాంనగర్‌కు

# బిటి రోడ్డును మంజూరు చేయాలి

**ఉప్పునుంతల, అక్టోబరు 22 ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉప్పునుంతల నుంచి కొత్త రాంనగర్ వరకు బిటి రోడ్డును మంజూరు చేయాలని ఆ గ్రామ ప్రజలు కోరుతున్నారు. మండల కేంంద్రానికి అతి సమీపంలో ఉన్న గ్రామానికి బిటి రోడ్డు సౌకర్యం కల్పించకపోవడం శోచనీయమని అంటున్నారు. వర్షాకాలంలో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నట్లు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు మట్టిరోడ్డు పూర్తిగా దెబ్బతిన్నది. మండల కేంద్రానికి వివిధ పనుల నిమిత్తం వెళ్లే ప్రజలు, రైతులు ఈ రోడ్డుపై ప్రయాణం చేయాలంటే ఎన్నో ఇబ్బందులు పడుతున్నామని వారు వాపోతున్నారు. చినుకు పడితే రోడ్డంతా చిత్తడిగా మారి ప్రయాణానికి అసౌకర్యం కలుగుతున్నదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు పూర్తి కావస్తున్నా మా గ్రామానికి స్వాతంత్రం రాలేదని, ఎన్నికల సమయంలో పాలకులు ఎన్నో హామీలు ఇచ్చి వెళ్తుంటారు. తమ గ్రామానికి వచ్చిన ప్రతి ఒక్కరు మా హయాంలో మీ గ్రామానికి బిటి రోడ్డు వేయిస్తామని ఎన్నో దఫాలు హామీలు ఇచ్చి దశాబ్దాలు గడుస్తున్నా తమ గ్రామ రోడ్డు గురించి పట్టించుకున్న పాపాన పోలేదు. నల్లమల ముద్దుబిడ్డ ఈ ప్రాంతవాసి కావడంతో ప్రత్యేక దృష్టి సారించి తమ గ్రామానికి బిటి రోడ్డు మంజూరు చేయించాలని అచ్చంపేట ఎమ్మెల్యే డా. వంశీకృష్ణను ఏకరువు పెట్టుకుంటున్నారు. ఇప్పటికే గ్రామాలలో బిటి రోడ్డులను మంజూరు చేసి శంకుస్థాపనలు చేశారు. అదే విధంగా మా గ్రామానికి బిటి రోడ్డు మంజూరు చేసి వీలైనంత త్వరగా పనులు ప్రారంభించాలని, అచ్చంపేట ఎమ్మెల్యే డా. వంశీకృష్ణ తమ గ్రామంలో ప్రత్యేకంగా పర్యటించి తమ గోడును విన్నవించుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



నరకప్రాయంగా మారిన కొత్త రాంనగర్ రోడ్డు

## అనాటి పోరాటాల ఫలితం...

### - వ్యవసాయ శాఖ కమిషన్ సభ్యుడిగా కేవీఎన్‌రెడ్డి

**వంగూరు, అక్టోబరు 22 ప్రభాతవార్త:** ఉమ్మడి పాలమూరు జిల్లాలో వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి పర్చాలనే లక్ష్యంతో జలసాధన సమితిని ఏర్పాటు చేసి కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు మంజూరుకు సూత్రదారి అయిన కొండారెడ్డిపల్లి ముద్దుబిడ్డ కేవీఎన్‌రెడ్డి. ఎన్నో పోరాటాలు చేసి ప్రజలతో మమేకమై ప్రభుత్వాలను దిగివచ్చేలా చేసి ప్రజల సమస్యలను పరిష్కరించే వరకు తన పోరాటం ఆపేది లేదంటూ అమరణ నిరాహర దీక్షలు చేపట్టి అనాటి ప్రభుత్వాన్ని దిగివచ్చేలా చేసి విద్యుత్ సమస్యను, సాగునీటికై కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ మంజూరుకు చేసిన పోరాటానికి ఫలితం దక్కించుకొని కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు నిర్మాణానికి దోహద పడిన వ్యక్తిగా పేరొందారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే తన రాజకీయ జీవితంలో ఎన్నో పదవులను అనుభవిస్తూ ప్రజల సంక్షేమానికి మొగ్గు చూపుతూ ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా పనిచేస్తూ తాను నమ్మిన ప్రజల కష్ట సుఖాల్లో పాలు పంచుకొని సమస్య సాధకుడిగా రైతు సంక్షేమానికి పాటు పడి వ్యవసాయ రంగ అభివృద్ధికి నిరంతరం పోరాడుతూ రైతు బిడ్డగా పేరొందారు. అనాడు చేసిన పోరాటల ఫలితంగానే నేటి కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఏర్పాటు చేసిన వ్యవసాయరంగంలో మొట్టమొదటగా కమిషన్ సభ్యులుగా నియామక కావడంతో ఈ ప్రాంత ప్రజలు అదృష్టంగా భావిస్తున్నారు. రైతు బిడ్డగా పేరొందిన కేవీఎన్‌రెడ్డి రైతు సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడుతున్న వ్యక్తికి వ్యవసాయ కమిషన్ సభ్యులుగా పదవి అందడం రైతాంగానికి మరింత చేరువగా మెలిగి రైతు సమస్యల పరిష్కారానికి ఎంతో మేలు చేకూరుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కేవీఎన్‌రెడ్డి వ్యవసాయ కమిషన్ సభ్యులుగా ఎంపిక చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ కేవీఎన్‌రెడ్డికి వంగూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పండిత్‌రావు, ప్రచార కమిటీ చైర్మన్ పాండురంగారెడ్డిలు హార్ధిక శుభాకాంక్షలు తెలిపారు.



సీఎం రేవంత్‌రెడ్డిని ఆలింగనం చేసుకున్న కేవీఎన్‌రెడ్డి ఫైల్

## కళ్ళ ముందు ప్రభుత్వ స్థలాలు.. పట్టించుకోని అధికారులు

**ఖిల్లాఘణపురం అక్టోబరు 22 ప్రభాతవార్త :** కళ్ళ ముందు ప్రభుత్వ కాలి స్థలాలు కనిపిస్తున్న ప్రభుత్వ అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మండల పరిధిలోని మల్కిమియానుపల్లి గ్రామానికి ఇటీవల మహిళ సమైక్య భవనంతో పాటు గ్రామపంచాయతీ భవనము మంజురయ్యాయి దీంతో అధికారులు గత వారం రోజులుగా గ్రామంలో సర్వేయర్ తో సర్వే చేయిస్తున్నారు. గ్రామము నడిబొడ్డులో ప్రభుత్వానికి చెందిన 4 సర్వే నెంబర్లో ఒక ఎకరా 23 గుంటల ప్రభుత్వ స్థలం ఉన్నది దీంట్లో గత 40 సంవత్సరాల క్రితమే దేవాలయం తో పాటు కొంతమంది ఇళ్లను నిర్మించుకున్నారు. ఇటీవల దేవాలయం పల్లె పార్కు ఏర్పాటు చేసుకున్నారు. దాదాపు ఇంకా 1200 గజాలకు పైగా ఖాళీ స్థలం ఉన్నది అయినా ప్రభుత్వ సర్వేయర్ తో పాటు మండల అధికారులు పట్టించుకోవడంలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మంగళవారం రోజు స్థానిక ఎంపీడీఓ వెంకటాచారి, సర్వేయర్ ఆనంద్, తిరుపతయ్య, గిరిధావర్ కలిసి గ్రామంలోని సర్వే నంబర్ నాలుగుతో పాటు పలు ప్రభుత్వ స్థలాలను పరిశీలించారు. పల్లె పార్కు, క్రీడా ప్రాంగణంలో స్థల పరిశీలన చేశారు. ప్రభుత్వ స్థలాలను పరిశీలించడం సమంజసం కాదని ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాలలో పంచాయతీ భవనంతో పాటు మహిళా సమాఖ్య భవనం నిర్మించడానికి అధికారులు కృషి చేయాలని గ్రామస్తులు కోరారు. ఎంపీడీఓ తో పాటు మండల పంచాయతీరాజ్ ఏఈ రమేష్ నాయుడు పంచాయతీ కార్యదర్శి రాజు పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.



ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి హద్దులు ఏర్పాటు చేస్తున్న మండల అధికారులు

## అంగన్వాడీ సెంటర్లో చిన్నారులకు వైద్య పరీక్షలు

**వీపనగండ్ల అక్టోబరు 22 ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని అంగన్వాడీ సెంటర్లో విద్యను అభ్యసిస్తున్న చిన్నారులకు మంగళవారం నాడు ఆర్.బి.ఎస్.కె వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించారు. బరువు తక్కువ ఉన్న వారిని గుర్తించి మందులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్లు నరేష్ లావణ్య మాట్లాడుతూ అంగన్వాడీ సెంటర్లో విద్యనభ్యసిస్తున్న చిన్న పిల్లలు వారికి అన్ని రకాలుగా వైద్య పరీక్షలు తరచూ నిర్వహిస్తూ వారి పెరుగుదల బుద్ధి మాన్యం వారి వైకల్యా ఎలాంటి అనారోగ్యాలకు గురికాకుండా ఆరోగ్యపరంగా ఉన్నారా లేదా అనే విషయాలపై వైద్య పరీక్షలు నిర్వహించి తగు జాగ్రత్తలు తీసుకోవడం జరుగుతుందని వారు తెలిపారు. పిల్లలు నీరసంగా ఉండే వారికి మందులు అందజేసి వారిని బలంగా పనిచేయడంతో పాటు తిండి తినే విధంగా ఆకలి అవడంతో పాటు కొన్ని పోషక పదార్థాలను అంగన్వాడీ సెంటర్లో అందివ్వడం జరుగుతుందని వారు ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య బృందం డాక్టర్లు ఉమా, స్వప్న తో పాటు అంగన్వాడీ ఉపాధ్యాయురాలు ఎల్లమ్మ ,సుగుణబాయి తదితరులు పాల్గొన్నారు.



అంగన్వాడీ సెంటర్లో పిల్లలను పరీక్షిస్తున్న వైద్య బృందం

## పాఠశాలను తనిఖీ చేసిన ఎంఈఓ



అయ్యవారిపల్లి పాఠశాలలో రికార్డులను పరిశీలిస్తున్న ఎంఈఓ

**ఉప్పునుంతల, అక్టోబరు 22 ప్రభాతవార్త :** మండల పరిధిలోని అయ్యవారిపల్లి, వెల్టూరు ప్రాథమిక పాఠశాలలను మంగళవారం మండల విద్యాశాఖాధికారి చంద్రశేఖర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల రికార్డులను పరిశీలించారు. ఎస్ఏ 1 జవాబు పత్రాలను మూల్యాంకనం చేసి సకాలంలో ఆన్‌లైన్‌లో మార్కులను నమోదు చేయాలని ఆయన సూచించారు. విద్యార్థులందరు పరీక్షలు రాసేలా చూడాలని కోరారు. పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

## అయోడిన్ లోపం వల్ల కలిగే నష్టాలు..



అయోడిన్ ఉప్పుపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**ఉట్కూరు, అక్టోబరు 22 ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వారి ఆధ్వర్యంలో ఉట్కూరు గ్రామ సచివాలయంలో అయోడిన్ లోపించడం వలన కలిగే రుగ్మతల గురించి ఉప్పు పరీక్ష చేసి ప్రజలకు అవగాహన కల్పించడం జరిగింది. ఉప్పులో అయోడిన్ లోపించడం వలన కలిగే దుష్పరిణామాలను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో డా.భవాని, ఆరోగ్య విస్తరణ అధికారి విజయ్‌కుమార్, ఆరోగ్య పర్యవేక్షకులు నరసింహులు, ఆరోగ్య కార్యకర్తలు గోవిందమ్మ, కవిత, ఎంపిఓ లక్ష్మి నరసింహరాజు, గ్రామ సచివాలయ సెక్రెటరీ శ్రీనివాసరావు, గ్రామ పంచాయతీ సిబ్బంది, అంగన్‌వాడి కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## భూ తగాదా కేసులో నిందితుడి అరెస్టు రిమాండ్‌కు తరలింపు

**ఖిల్లాఘణపురం అక్టోబరు 22 ప్రభాతవార్త :** మండల పరిధిలోని మానాజీపేటలో ఈనెల 8వ తేదీన అదే గ్రామానికి చెందిన సతీష్‌పై భూమి విషయంలో తగాదాకేసులో దాడిచేసిన మొదటి నిందితుడు రాజానాల బాలరాజును మంగళవారం రోజు అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు ఎస్సై సురేష్‌గౌడ్ తెలిపారు దీంతో కేసులో నిందితులందరిని అరెస్టు చేశామని కొందరిలోనే చార్జి సీటు వేసి కోర్టుకు సమర్పిస్తామన్నారు.

## పాఠశాలను సందర్శించిన మానిటరింగ్ అధికారి రామచంద్ర ఆచారి

**కృష్ణా, అక్టోబరు 22 ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి 100 శాతం ఉత్తీర్ణత, సమ్మేటివ్ పరీక్షలు, అదేవిధంగా నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే విధానంపై జిల్లా అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ రామచంద్ర ఆచారి సందర్శించారు. ఈ కార్యక్రమంలో కృష్ణ మండల ఎంఈఓ నిజాముద్దీన్, మాగనూరు మండల ఎంఈఓ మురళీమోహన్‌రెడ్డి, మండల ఎంఈఓ అనిల్‌గౌడ్, సీఆర్పీ అమిన్‌రెడ్డి, పాఠశాలల ఉపాధ్యాయులు బృందం పాల్గొన్నారు.

## విద్యుత్ సిబ్బంది బదిలీలు...



నియామక పత్రం అందుకుంటున్న లైన్‌మెన్ లక్ష్మణ్

**వెల్దండ, అక్టోబరు 22 ప్రభాతవార్త:** వెల్దండ మండలంలోని విధులు నిర్వర్తిస్తున్న విద్యుత్ సిబ్బంది బదిలీలు అయ్యారు. వెల్దండ లైన్ ఇన్‌స్పెక్టర్ రాంచందర్ నాగర్‌కర్నూల్‌కు బదిలీ కాగా ఆయన స్థానంలో కల్వకుర్తి పట్టణం నుంచి వెల్దండకు శ్రీనివాస్ బదిలీపై వచ్చారు. లైన్‌మెను యుగేందర్ ఊర్కొండ మండలానికి బదిలీ కాగా, కల్వకుర్తి నుంచి వెల్దండకు లక్ష్మణ్ బదిలీపై వచ్చారు. కొత్ర లైన్‌మెన్ నాగేందర్ వంగూరు మండలానికి బదిలీ అయ్యారు. మక్బూల్ చెర్కూర్ నుంచి కల్వకుర్తికి, శ్రీనివాస్ అచ్చంపేట నుంచి చెర్కూర్‌కు బదిలీ అయ్యారు. కట్టర్ల విజయ్ కల్వకుర్తికి, ప్రవీణ్‌రెడ్డి పంజుగులకు, ధర్మేందర్ భైరాపూర్ నుంచి కల్వకుర్తికి బదిలీలు అయి కొత్తగా వచ్చిన వారు విధుల్లో బాధ్యతలు చేపట్టారు. వెల్దండ మండలానికి బదిలీపై వచ్చిన లైన్‌మెన్ లక్ష్మణ్‌కు ఏఈ సూర్యనాయక్ నియామక పత్రం అందించడంతో పాటు విధుల్లో చేరిన వారందరికి నియామక పత్రం అందించారు.

### విద్య, వైద్య సదుపాయాలపై

# శిక్షణ అధికారులు పరిశీలన..

**అంగన్‌వాడి కేంద్రం, ప్రభుత్వ పాఠశాల, పల్లె దవాఖానలను పరిశీలించిన శిక్షణ అధికారులు**

**ఇటిక్యాల, అక్టోబరు 22 ప్రభాతవార్త :** మండల పరిధిలోని కోదండపురం గ్రామంలో మంగళవారం అంగన్‌వాడి కేంద్రం ప్రభుత్వ పాఠశాల పల్లె దవాఖానలను పరిశీలించి పాఠశాలలోని విద్యార్థుల సామర్థ్యాలను, పల్లె దవాఖానాలో ప్రజలకు అందుతున్న అందిస్తున్న వైద్య సదుపాయాలపై ఉపాధ్యాయులను వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. జోగులాంబ గద్వాల జిల్లాలో 25 మంది శిక్షణ అధికారులు రాగా ఇందులో 5 మండలాలకు మండలానికి ఐదుగురు చొప్పున శిక్షణ అధికారులను కేటాయించారు. అందులో భాగంగా మొదటి రోజు మంగళవారం శిక్షణ బృందం అధికారులు లోకేష్ యాదవ్, ఇంద్రజిత్ సిరా, నికిత యాదవ్, డింపుల్ యాదవ్, బసవరాజు వాలికర్, మండల పరిధిలోని కోదండపురంలోని ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థుల తరగతి గదులు, మరుగుదొడ్లు, మూత్రశాలలను పరిశీలించారు. అంగన్‌వాడి కేంద్రాన్ని పరిశీలించి చిన్నారులతో మాట్లాడుతూ ఇంగ్లీషులో పదాలను మాట్లాడిస్తూ అలాగే కొన్ని ఫోటోలను చూయిస్తూ వాటికి చిన్నారుల నుండి సమాధానాలను రాబట్టారు. కేంద్రంలోని గోడపత్రికలు అంగన్‌వాడి కేంద్రంలో ద్వారా అందించే పౌష్టికాహార పంపిణీ వాటి ద్వారా అందే ప్రయోజనాలపై టీచర్లను అడిగి తెలుసుకున్నారు. అభినందిస్తూ వారికి చాక్లెట్లను తెప్పించి పంపిణీ చేశారు. అదేవిదంగా ప్రాథమిక ఉన్నత పాఠశాలలోని తరగతి గదులను పరిశీలించారు. పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ కొన్ని ముఖ్యమైన ప్రశ్నలు వేసి విద్యార్థినీ, విద్యార్థుల నుండి సమాధానం రాబట్టారు. అనంతరం పాఠశాల హెచ్ఎం ఆధ్వర్యంలో ఐదుగురు శిక్షణ అధికారులను ఘనంగా సన్మానించారు. అనంతరం గ్రామంలోని పల్లె దవాఖానను పరిశీలించారు. అందులో గ్రామ ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలు, మహిళల డెలివరీ అత్యవసర సమయంలో వైద్య సేవలు



పల్లె దవాఖానాలో శిక్షణ అధికారులకు బిపి చెక్ చేస్తున్న వైద్య సిబ్బంది



అంగన్‌వాడి చిన్నారులతో ముచ్చటిస్తున్న శిక్షణాధికారులు

ఏ విధంగా అందిస్తారని ఎంఎల్‌హెచ్‌పి అనూషను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శిక్షణ అధికారులకు ఎంఎల్‌హెచ్‌పి సమాధానం ఇస్తూ మహిళల డెలివరీ కోసం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకు వెళ్తామని అత్యవసర పరిస్థితుల్లో జిల్లా కేంద్రంలోని ఏరియా ఆసుపత్రికి తీసుకువెళ్తామని గ్రామంలోని బిపి, షుగర్, టిబి వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం నుండి మందులను అందిస్తున్నామని, ఏఎన్ఎంలు ప్రతి బుధవారం శనివారం వ్యాక్సినేషన్ అందిస్తారని శిక్షణ అధికారులకు వైద్య సిబ్బంది వివరించారు. అలాగే ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు గ్రామంలో ప్రజలకు అందించే సేవలపై అడిగి తెలుసుకున్నారు. పశువైద్య డా. భువనేశ్వరి శిక్షణ అధికారులకు వివరిస్తూ పశువైద్య శాఖ ఆధ్వర్యంలో చేపట్టే పశువులకు అందించే వైద్య సేవలపై కూడా శిక్షణ అధికారులకు వివరించారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి శ్యాంసుందర్, ఎంపిడిఓ మహ్మద్ హజార్ మోహియుద్దీన్, ఏపిఓ శివజ్యోతి, ఎపిఎం కురుమన్న, టెక్నికల్ అసిస్టెంట్ కృష్ణ, పిహెచ్ఎన్ సత్యమ్మ, పంచాయతీ కార్యదర్శులు లావణ్య, రాధిక, మాజీ సర్పంచ్ సుంకన్న, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, అంగన్‌వాడి టీచర్లు తదితరులు ఉన్నారు.

# స్వచ్ఛంద సేవా సంస్థల్లో వాసవీక్లబ్ అగ్రస్థానంలో నిలిచింది

■ వాసవీక్లబ్ సేవలు దేశ వ్యాప్తంగా విస్తరించి పోయాయి ■ అంతర్జాతీయ వాసవీక్లబ్ జాయింట్ సెక్రటరీ మల్టిపుల్ వాసవీయన్ పుల్లరి ప్రకాష్

**కల్వకుర్తి, అక్టోబరు 22 ప్రభాతవార్త:** స్వచ్ఛంద సేవా సంస్థల్లో వాసవీక్లబ్ అగ్రస్థానంలో నిలిచిందని, వాసవీక్లబ్ సేవలు దేశ వ్యాప్తంగా విస్తరించాయని, ఆర్య వైశ్యులకు, ఆర్యవైశ్యేత్రులకు సేవలు అందిస్తున్న ఏకైక స్వచ్ఛంద సేవా సంస్థ వాసవీక్లబ్ అని అంతర్జాతీయ వాసవీక్లబ్ జాయింట్ సెక్రటరీ మల్టిపుల్ వాసవీయన్ పుల్లరి ప్రకాష్ అన్నారు. కల్వకుర్తి పట్టణంలోని కన్యకా పరమేశ్వరి దేవాలయంలోని ఫంక్షన్‌హాల్ రీజియన్ చైర్మన్ సత్యనారాయణ అధ్యక్షతన మంగళవారం రీజియన్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అంతర్జాతీయ వాసవీక్లబ్ జాయింట్ సెక్రటరీ మల్టిపుల్ వాసవీయన్ పుల్లరి ప్రకాష్, ఉపాధ్యక్షులు సేవా సంకల్ప జూలూరి రమేష్‌బాబు, అదనపు కోశాధికారి కల్వ హరికృష్ణ, అబ్జర్వర్ మిడిదొడ్డి రామకృష్ణలు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పుల్లరి ప్రకాష్ మాట్లాడుతూ గ్రామ స్థాయి నుంచి



మాట్లాడుతున్న అంతర్జాతీయ వాసవీక్లబ్ జాయింట్ సెక్రటరీ మల్టిపుల్ వాసవీయన్ పుల్లరి ప్రకాష్

పట్టణ ప్రాంతాల్లోని అన్ని వర్గాలకు సేవలు అందిస్తూ ఎన్నో అవార్డులు రాష్ట్రపతి, విదేశాల్లో సైతం ప్రశంసలు అందుకున్న ఘనత వాసవీక్లబ్‌ది అన్నారు. అనంతరం సేవా సంకల్ప జూలూరి రమేష్‌బాబు మాట్లాడుతూ కల్వకుర్తి వాసవీ క్లబ్ ప్రారంభం నుంచి ప్రతి గ్రామంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల, ప్రజా ప్రతినిధుల, అధికారుల మన్ననలు పొందారన్నారు. ఆటపాటలతో బ్యానర్ ప్రజెంటేషన్ కార్యక్రమం చేపట్టారు. సేవా కార్యక్రమాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వాసవీక్లబ్‌లకు మెమెంటోతో పాటు సన్మానం చేశారు. కార్యక్రమంలో రీజియన్ పరిధిలోని 10క్లబ్‌ల అధ్యక్ష కార్యదర్శులు, కోశాధికారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో వెంకటేశ్వర దేవాలయ చైర్మన్ కల్వ మనోహర్, కల్వకుర్తి వాసవీక్లబ్ అధ్యక్షులు చిదిరే శ్రీనివాసులు, రీజియన్ సభ్యులు కలిమిచర్ల రమేష్, గుగ్గిళ్ళ శంకర్, గోపాల్, మనోహర్, ఆంజనేయులు, దుగ్గి అశోక్, శ్రీలక్ష్మి, లక్షి ్మ, ధనలక్ష్మి,వాసవీక్లబ్ సభ్యులు, ఆర్యవైశ్య అనుబంధ సంఘాల నాయకులు, మహిళలు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## పైరవీకారులను ఆశ్రయించవద్దు

**చిన్నచింతకుంట, అక్టోబరు 22 ప్రభాతవార్త:** తహసిల్దార్ కార్యాలయానికి వచ్చే దరఖాస్తు దారులు నేరుగా అధికారులకు తమ పత్రాలు అందించాలని తహసిల్దార్ ఎల్లయ్య తెలిపారు. అధికారుల చాంబర్ల ముందు దరఖాస్తుదారులు మధ్య వర్తులను ఆశ్రయించ వద్దని రాస్తూ గోడపత్రికలు వెలిశాయి. ప్రతిరోజు మండలంలోని ఆయా గ్రామాలలో వచ్చే దరఖాస్తుదారులను పైరవీకారులు ముందే ప్రసన్నం చేసుకుని వారి ధృవపత్రాలకు ధర నిర్ణయించి ఈ ధృవ పత్రాలను కట్టలుగాతీసుకొస్తున్నారని విమర్శలు వెలువెత్తుతున్నాయి. దరఖాస్తుదారులు పైరవీకారులచుట్టు తిరగకుండా నేరుగా అధికారుల వద్దకు వెళ్లి తమ దరఖాస్తులను సమర్పించి ధృవపత్రాలను పొందాలని తహసిల్దార్ తెలిపారు. పైరవీకారులను నమ్మితే ధృవ పత్రాలలో తప్పులు జరిగే అవకాశం ఉందని దీన్ని దృష్టిలో ఉంచుకుని దరఖాస్తుదారులు పైరవీ కారుల వద్దకు వెళ్లకుండా అధికారులను సంప్రదించాలని దరఖాస్తుదారులకు సూచించారు. రెవెన్యూ అధికారులు పైరవీకారులు తీసుకొచ్చే ధృవపత్రాలను తీసుకోకుండా దరఖాస్తు చేసుకున్న వారు వస్తేనే ఆయా ధృవ పత్రాలనుజారీచేస్తామనితెలిపితేపైరవీకారులవ్యవస్థకొంతతగ్గవచ్చునిమండలప్రజలు చర్చించుకుంటున్నారు.




కార్యాలయ గోడలపై వెలసిన పత్రాలు

## శ్రీపాద శ్రీవల్లభాపుర క్షేత్రంలో వైభవంగా 3వ రోజు సాప్తాహిక హోమం

**మక్తల్ టౌన్,అక్టోబరు22 ప్రభాతవార్త:** శ్రీపాద వల్లభాపురం క్షేత్రంలో జగద్గురు శ్రీశ్రీశ్రీ దత్తాత్రేయ స్వామి మహా సంస్థాన పీఠం గ్రామం పసుపుల శ్రీపాద శ్రీవల్లభాపురం నందు విశ్వశాంతి మహాయాగం కొనసాగుతుంది.ఈనెల శనివారం వరకు నిత్య కార్యక్రమాలు, ప్రతిరోజు ఉదయం ఎనిమిది గంటలకు యాగశాల ప్రవేశం, హోమ పూర్ణాహుతి అనంతరం మహా మంగళారతి తీర్థ ప్రసాద వితరణ అన్న సమారాధన జరుగుతుందన్నారు.మంగళవారం మూడవ రోజు సాప్తాహిక హోమం ఘనంగా నిర్వహించారు. పూర్ణాహుతి అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. ప్రజలందరు పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలని శ్రీదత్తపీఠం ట్రస్టు, దేవాలయ కమిటి సభ్యులు తెలిపారు.



సాప్తాహిక హోమం నిర్వహిస్తున్న భక్తులు

## రక్తదానం చేసిన దాతలను అభినందించిన బెటాలియన్ డిఐజి

**ఇటిక్యాల,అక్టోబరు22 ప్రభాతవార్త :** మండల పరిధిలోని ఎర్రవల్లి చౌరస్తాలో గల పదవ బెటాలియన్‌లో పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం బెటాలియన్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. 22 మంది సిబ్బంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన దాతలను అభినందిస్తూ బెటాలియన్ డిఐజి ఎమ్ఎస్ సిద్ధికి పండ్లు, జ్యూస్ అందించారు. కార్యక్రమంలో బెటాలియన్ కమాండెంట్ ఎన్వి సాంబయ్య, అడిషనల్ కమాండెంట్ సుబ్రహ్మణ్యం, అసిస్టెంట్ కమాండెంట్ చౌహాన్ ఇన్స్‌పెక్టర్లు రాజారావు, ఆర్‌పి సింగ్, గోపాల్, వెంకటేశ్వర్లు, ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



## ఉపాధ్యాయుడికి ఘన సన్మానం

**మక్తల్,అక్టోబరు 22 ప్రభాతవార్త:** ఇటీవల నిర్వహించిన డీఎస్సీ 2024లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఎస్జీటి ఉపాధ్యాయుడిగా ప్రభుత ఉద్యోగం పొందిన మక్తల్ మండలంలోని చిట్యాల యువకుడు మంగలి నరసింహులును మంగళవారం గ్రామ యువకుల ఆధ్వర్యంలో పూలమాల, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఇప్పటికే బెటాలియన్ కానిస్టేబుల్, ఏఆర్ కానిస్టేబుల్‌గా రెండుసార్లు ప్రభుత్వ ఉద్యోగం పొందిన మంగలి నరసింహులు పట్టు వదలని విక్రమార్కుడిలా అహర్నిశలు శ్రమించి తాజాగా ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా మండలంలోని ఎర్సన్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో ఉద్యోగంలో చేరడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.పోటీ పరీక్షల కోసం సిద్ధమయ్యే గ్రామంలోని యువతకు ఎల్లప్పుడూ తమ సహాయ సహకారాలు అందిస్తామని, భవిష్యత్తులో మరింత మంది కష్టపడి చదువుకుని ప్రభుత్వ ఉద్యోగాలను సాధించాలని గ్రామ యువకులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో డి.వెంకటేష్, మారుతి, పుట్టి వెంకటేష్, ఎల్. రంగప్ప, నితిన్, చాకలిబాబు, అంజి, ముదుమాల్ అశోక్, ఎస్.అంజి, పుల్లరి అంజి, నర్సింహ, శంకర్, ఆటో అంజి, నరసింహ, పి. అశోక్, చాంద్‌పాషా, కె. వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న దృశ్యం

## పోలీసు అమర వీరులకు ఘన నివాళులు

**వనపర్తి, అక్టోబరు 22 ప్రభాతవార్త :** పోలీసు అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకొని వనపర్తి పట్టణ కేంద్రంలోని శిరిడి సాయి కాంప్లెక్స్‌లో గల ప్రేమ్ టైలర్ నానమోని మన్యం ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రజా గాయకుడు రాజారాం ప్రకాష్ హాజరయ్యారు. అనంతరం ప్రేమ్ టైలర్ నానమోని మన్యం షాపులో ఏర్పాటుచేసిన అమరవీరుల స్థూపం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. టైలర్ నానమోని మన్యం తనవంతుగా సొంత ఖర్చులతో ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్లు పంచడం, వాతావరణ కాలుష్య నివారణలో భాగంగా ప్లాస్టిక్ కవర్లను వాడవద్దని కాటన్ చేయి సంచులనే వాడాలంటూ స్వతహాగా తన ఖర్చులతో తెప్పించిన కాటన్ బ్యాగులను ప్రజలకు పంచడమే కాక రక్తదాన శిబిరాలను ఏర్పాటుచేయడం వంటి కార్యక్రమాలు చేపట్టడం ఎంతో హర్షించదగ్గ విషయం అన్నారు. ఈ కార్యక్రమంలో సి.కుర్మయ్య, శాంతన్న, ఏసుప్రభు, ఎం.డి బాల్మియా, సూరిబాయి సుంకరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థులకు వైద్య పరీక్షలు

**ఉప్పునుంతల,అక్టోబరు 22 ప్రభాతవార్త :** మండలంలోని వెల్టూరు గ్రామంలో నిర్వహిస్తున్న మహాత్మా జ్యోతిరావు పూలే బాలికల విద్యాలయంలో మంగళవారం ఉప్పునుంతల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డా. స్వప్న ఆధ్వర్యంలో విద్యార్థినిలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. విద్యార్థినిలకు వివిధ వ్యాధుల పట్ల అవగాహన కల్పిస్తూ రక్త పరీక్షలు నిర్వహించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వ్యక్తిగత ఆరోగ్యం పట్ల విద్యార్థినిలు జాగ్రత్తగా ఉండాలని వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తలు పాటించాలని వైద్యాధికారిణి డా.స్వప్నలు సూచనలు, సలహాలు అందించారు. ఈ శిబిరంలో వైద్యాధికారిణి స్వప్నతో పాటు కళాశాల ప్రిన్సిపాల్ యామిని, సూపర్‌వైజర్ ప్రభావతి, నవ్య, ఎంఎల్‌హెచ్‌పి, జడదీష్, జయ,సైదా, స్టాఫ్ నర్సు, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## కులమతాలకతీతంగా పండుగలు నిర్వహించుకోవాలి

- ఘనంగా గ్యార్మీ పండుగ వేడుకలు

**కల్వకుర్తి, అక్టోబరు 22 ప్రభాతవార్త:** కులమతాలకతీతంగా ప్రతి ఒక్కరు పండుగలు నిర్వహించుకోవాలని మున్సిపల్ చైర్మన్ ఎడ్మసత్యం, మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్‌లు పేర్కొన్నారు. కల్వకుర్తి పట్టణంలో గ్యార్మీ పండుగను పురస్కరించుకొని మంగళవారం జెన్ యూత్ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్, సీఐ నాగార్జునలు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్యార్మీ నెలలో ముస్లిం సోదరులు కులమతాలకతీకతంగా పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అంత కంటే ముందు జేఎన్‌యూత్ సభ్యులు కూర గాయల మార్కెట్‌రోడ్డు నుంచి భారీ ర్యాలీతో పట్టణంలోని మహబూబ్ సుభాని దర్గా వద్దకు చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిం చారు. అన్నదాన కార్యక్రమానికి విచ్చేసిన ప్రముఖులను జేఎన్ యూత్ సభ్యులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షాహేద్, ఎస్ఐ మాధవరెడ్డి, కౌన్సిలర్లు షాన్‌వాజ్‌ఖాన్, షేక్ ఏజాస్, మాజీ కౌన్సిలర్ శ్రీకాంత్‌రెడ్డి, ఎంఐఎం పార్టీ అధ్యక్షులు అబ్దుల్ సత్తార్, నాయకులు మసూద్, రేష్మాబేగం,ఖాదర్, జమ్ముల శ్రీకాంత్, సంతుయాదవ్, జేఎన్ యూత్ సభ్యులు జహీర్, సాజీద్, మహమూద్, ఇంతియాజ్, సల్లు, ఇలియాస్, ఫిరోజ్, సొహెల్, షారు, రియాజ్, షఫి తదితరులు ఉన్నారు.



అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

## సిల్వర్ పతకం సాధించిన బీడీ టీం పోలీసులు

**నారాయణపేట టౌన్,అక్టోబరు 22 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రస్థాయి పోలీస్ డ్యూటీ మీట్ పోటీల్లో సిల్వర్ పతకం సాధించిన బీడీ టీం పోలీసులను జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ అభినందించారు. ఈనెల 16 నుండి 19 వరకు హైదరాబాద్ తెలంగాణ రాష్ట్ర పోలీస్ అకాడమీలో జరిగిన రాష్ట్రస్థాయి పోలీస్ డ్యూటీ మీట్ 2004 పోటీల్లో జోగులాంబ జోన్ 7 తరపున నారాయణపేట జిల్లా నుండి యాంటీ సబ్జెక్టు చెక్ రూమ్ సెర్చ్‌లో ప్రతిభ కనబర్చి సిల్వర్ మెడల్, ప్రశంసా పత్రం సాధించిన కానిస్టేబుల్స్ చంద్రశేఖర్, ఆంజనేయులను జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ అభినందించారు. నేషనల్ స్థాయిలో జార్ఖండ్ రాష్ట్రంలో జరగబోయే పోటీల్లో పాల్గొని రాష్ట్రానికి మరిన్ని పతకాలు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎండి రియాజ్, ఆర్ఐ నరసింహ, సిల్వర్ పతకాలు పొందిన కానిస్టేబుల్స్ చంద్రశేఖర్, ఆంజనేయులు, బీడీ టీం ఇంఛార్జి బ్రహ్మానందరెడ్డి పాల్గొన్నారు.



పోలీస్ టీంను అభినందిస్తున్న దృశ్యం

## బ్యాంకు సేవలు సద్వినియోగం చేసుకోవాలి

◆ సిఎఫ్ఎల్ ప్రాజెక్టు డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ శేఖర్‌రెడ్డి

**లింగాల,అక్టోబరు 22 ప్రభాతవార్త:** బ్యాంకు సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎస్సీ, ఎస్టీ, సిఎఫ్ఎల్ ప్రాజెక్టు డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ శేఖర్‌రెడ్డి అన్నారు. మంగళవవారం లింగాల మండల పరిధిలోని రాయవరం గ్రామంలో ఆర్థిక అక్షరాస్యత కేంద్రం లింగాల ఆధ్వర్యంలో గ్రామస్థాయిఅవగాహన కార్యక్రమం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి జీవన్ జ్యోతి, భీమా యోజన (రూ.436) ప్రధానమంత్రి సురక్షభీమా యోజన (రూ.20)అటల్ పెన్షన్ యోజన, సుకన్య సమృద్ధి యోజన పథకాల గురించి వివరించారు. భీమా చేయించుకోవడం వల్ల ఆపద సమయాల్లో బాధిత కుటుంబాలకు రూ. 2 లక్షల వరకు ప్రమాద భీమా సొమ్ము అందిచడం జరుగుతుందన్నారు. స్మార్ట్‌ఫోన్ ఉపయోగించేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు,సైబర్ భద్రత, డిజిటల్ సేవలపై ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ఎండి మన్సూర్, జె.రూపేష్, శ్రీశైలం గ్రామస్తులు ఉన్నారు.



బ్యాంకు సేవలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

## వికలాంగులకు మోటరైజడ్ బ్యాటరీ సైకిల్ పంపిణీ



వికలాంగులకు బ్యాటరీ సైకిల్ పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

**పెబ్బేరు అక్టోబరు 22, ప్రభాతవార్త:** పెబ్బేరు పట్టణంలో జిల్లా వికలంగుల సంఘం ఆధ్వర్యంలో వికలాంగులకు ట్రైసైకిళ్లను మంగళవారం రోజు అందజేశారు. కార్యక్రమాన్ని పురస్కరించుకొని నేషనల్ ఇన్స్టిట్యూట్ ఫర్ ది ఎంపవర్మెంటె ఆఫ్ ఫిజికల్ డిజేబుల్స్ ఏర్పాటు చేయబడిన వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ వికలాంగుల విభాగం ఆధ్వర్యంలో పెబ్బేర్ పట్టణంలో వనపర్తి జిల్లా బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అక్కి శ్రీనివాస్ గౌడ్, పెబ్బేర్ మార్కెట్ చైర్మన్ ప్రమోదీని రెడ్డి, పెబ్బేర్ మార్కెట్ వైస్ చైర్మన్ ఎద్దుల విజయవర్ధన్ రెడ్డి చేతుల మీదుగా జిల్లాకు చెందిన ఎనిమిది మంది వికలాంగులకు మోటరైజడ్ బ్యాటరీ సైకిళ్లని పంపీణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు సురేందర్‌గౌడ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేష్, నాయకులు యుగంధర్‌రెడ్డి, మార్కెట్ డైరెక్టర్లు రామన్‌గౌడ్,ఎల్లస్వామి, నరసింహనాయుడు,వికలాంగ విభాగం నాయకులు రమేష్, మధు, బీచుపల్లి, రాముడు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ అంతరాయం

**మాగనూరు,అక్టోబరు 22 ప్రభాతవార్త:** మండల కేంద్రంలో నేడు విద్యుత్ అంతరాయం ఉంటుందని మాగనూరు మండల పరిధిలోని మాగనూరు, వడ్వాట్, అచ్చంపేట, ఓబులాపూర్, పెగడబండ, అమ్మపల్లి, వర్కూర్ గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని మాగనూరు విద్యుత్ సబ్ స్టేషన్ 33కెవిలో బుధవారం మరమ్మతుల కారణంగా ఉదయం 10 గం.ల నుండి మధ్యాహ్నం 2 గం.ల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ గంగాధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

## రైతు కమిటీ ఎన్నిక

**వీపనగండ్ల అక్టోబరు 22 ప్రభాతవార్త:** వీపనగండ్ల గ్రామంలో మంగళవారం గ్రామ రైతు కమిటీని ఎన్నుకున్నారు. రైతుల సమక్షంలో ఈ కమిటీని ఎన్నుకున్నట్లు గ్రామ రైతులు తెలిపారు. నూతన కమిటీ ఈ విధంగా ఉంది అధ్యక్షులుగా పోతుల వెంకట్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ముంత కృష్ణయ్య యాదవ్, ఉపాధ్యక్షులుగా కత్తి నరసింహ, సిహెచ్ వెంకటయ్య, కోశాధికారిగా ఆవుల నారాయణ, కార్యదర్శిగా పెబ్బేటి మహేష్ లను గ్రామంలోని రైతులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ రైతులు కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ గ్రామంలోని రైతుల శ్రేయస్సు కోసం కృషి చేయడం జరుగుతుందని, రైతుల నుంచి వచ్చే ఆదాయ వనరులను రైతు కమిటీ,రైతుల అభిప్రాయం మేరకు రైతుల ప్రజల సంక్షేమం కోసం ఖర్చు చేయడం జరుగుతుందని వారు తెలిపారు.

## రాకొండలో ఇంట్లో చోరీపై కేసు నమోదు



రాకొండలో చోరీకి గురైన మల్లయ్య ఇల్లు

**తెల్కపల్లి,అక్టోబరు 22 ప్రభాతవార్త:** ఇంట్లో చోరీపై కేసు నమోదు చేసిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానిక ఎసైకస బి. నరేష్ అందించిన వివరాల ప్రకారం మండల పరిధిలోని రాకొండ గ్రామానికి చెందిన కొట్టే మల్లయ్య మంగళవారం మధ్యాహ్నం తన ఇంటికి తాళంవేసి తన భార్య రజితతో కలిసి కూరగాయల కోసం తెల్కపల్లి మండల కేంద్రానికి వెళ్లి కూరగాయలు తీసుకుని ఇంటికి వచ్చి చూసే సరికి ఎవరో గుర్తు తెలియని దుండగులు మల్లయ్య ఇంటి తాళం పగులకొట్టి ఇంట్లో బీరువాలో ఉన్న వస్తువులను చిందర వందర చేసి బీరువా సెల్ఫ్‌లో ఉన్న రూ.15 వేల నగదు, 2 గ్రాముల బంగారు కమ్మలు అపహరించినట్లు తెలిపారు. మొత్తం రూ.30 వేల వరకు నష్టం జరిగినట్లు తెలిపారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బి.నరేష్ తెలిపారు.

## ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన డిఎంహెచ్ఓ

**మాగనూరు,అక్టోబరు22 ప్రభాతవార్త:** మండల కేంద్రం మాగనూరు గ్రామంలో మంగళవారం శ్రీ ధన్వంతరి దయాగ్నోస్టిక్ సెంటర్‌ను డిఎంహెచ్ఓ సౌభాగ్య లక్ష్మి ఆకస్మికంగా పర్యవేక్షించారు. ల్యాబ్‌కు ఎలాంటి ప్రభుత్వ పర్మిషన్ లేకపోవడం చేత ల్యాబ్‌ను సీజ్ చేయాల్సిందిగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డా.నాగజ్యోతిని ఆదేశించారు. సాయంత్రం సమయంలో కానిస్టేబుల్ శివకుమార్, శ్రీశైలం, హెల్త్ సూపర్ వైజర్ వెంకటేష్ ఆధ్వర్యంలో రాజ శేఖర్, చంద్రాపూర్‌కు సంబంధించిన ల్యాబ్‌ను సీజ్ చేయడం జరిగింది. డిఎంహెచ్ఓ సౌభాగ్యలక్ష్మి సంవత్సరం ముందు నుండి హెచ్చరించిన వారు ఎలాంటి పర్మిషన్ లేకుండా ఇప్పటి వరకు ప్రభుత్వ పర్మిషన్ తీసుకోనందున డిఎంహెచ్ఓ ఆదేశాల మేరకు సీజ్ చేయడం జరిగిందని డా. నాగలక్ష్మి తెలిపారు.



ల్యాబ్‌ను పరిశీలిస్తున్న డిఎంహెచ్ఓ

## వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం

**మాగనూరు,అక్టోబరు 22 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని మందేపల్లి గ్రామంలో మంగళవారం డిఆర్‌డిఎ, ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మహిళా సంఘాలు, అగ్రికల్చర్ సిబ్బంది, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు ఆనంద్‌గౌడ్, వివిధ పార్టీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే జీఎంఆర్‌చే చెక్కుల పంపిణీ



భూత్పూర్‌లో చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జి మధుసూధన్‌రెడ్డి

**భూత్పూర్,అక్టోబరు 22,ప్రభాతవార్త :** దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూధన్‌రెడ్డి(జీఎంఆర్) మంగళవారం భూత్పూర్ మండల తహశీల్దార్ కార్యాలయంలో మండలంలోని పలు గ్రామాలకు చెందిన అర్హులైన లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్, కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు లిక్కి నవీన్‌గౌడ్,మాజీ ఎంపిపి కదిరే శేఖర్‌రెడ్డితో పాటు కాంగ్రెస్ నాయకులు మండల పార్టీ ప్రధాన కార్యదర్శి లిక్కి విజయ్‌కుమార్‌గౌడ్, హరియా నాయక్, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

## ట్రస్మా అధ్యక్షుడు లక్ష్మణ్‌కు ఎంజీ గ్లోబల్ శాంతి పురస్కారం



**భూత్పూర్,అక్టోబరు 22,ప్రభాతవార్త :** ట్రస్మా జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్‌కు మహాత్మాగాంధీ గ్లోబల్ శాంతి పురస్కారం లభించింది. సత్యం,అహింస అనే ప్రధానాయుధాలతో మన జాతిపిత మహాత్మాగాంధీ దేశంలో శాంతి,మతసామరస్యాన్ని నెలకొల్పి స్వాతంత్ర్యాన్ని సిద్ధింపజేసిన మహాత్మాగాంధీ జయంతి, అంతర్జాతీయ అహింసా దినోత్సవం సందర్భంగా తెలంగాణ సిటీజన్ కౌన్సిల్ ప్రతీ ఏటా అందజేస్తున్న ఈ పురస్కారం ఈ ఏడాది మహబూబ్‌నగర్ ట్రస్మా జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్ దక్కించుకున్నారు. మహాత్మాగాంధీ గ్లోబల్ శాంతి పురస్కారం అందుకున్న ట్రస్మా జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్‌ను పలు ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్లు అభినందించారు.

## కొమరం భీంకు ఘన నివాళి



కొమురం భీం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే

**మహబూబ్‌నగర్ బ్యూరో,అక్టోబరు 22 ప్రభాతవార్త:** అడవి బిడ్డల హక్కుల సాధన కోసం అలుపెరగని పోరాటం చేసిన, తెలంగాణ సాయుధ పోరాట యోధుడు కొమరం భీం అని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం కొమరం భీం జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని అసెంబ్లీ ప్రాంగణంలో నిర్వహించిన జయంతి వేడుకల్లో పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారి ఆశయాలను కొనసాగిస్తామని చెప్పారు. కార్యక్రమంలో మహబూబ్‌నగర్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రి పాల్గొన్నారు.

## నూతన ఉపాధ్యాయులకు సన్మానం



**ఉట్కూర్,అక్టోబరు 22 ప్రభాతవార్త:** తపస్ ఉట్కూర్ శాఖ ఆధ్వర్యంలో ఉట్కూర్ మండల కేంద్రంలో డీఎస్సీ 2024లో ఉద్యోగాలు సంపాదించిన వారికి ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఉట్కూర్ నుండి 2024 డీఎస్సీలో ఏడుగురు ఉపాధ్యాయులు ఎంపిక కావడం సంతోషకరమైన విషయమని తెలిపారు.ఉపాధ్యాయులుగా ఎంపికైన ఉపాధ్యాయులను జిల్లా, మండల నాయకులతో పాటు, గ్రామ పెద్దలు, యువకుల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తపస్ జిల్లా అధ్యక్షులు షేర్ కృష్ణారెడ్డి, కార్యదర్శి నరసింహ, జోగిని వ్యతిరేక సమితి జిల్లా కన్వీనర్ ఆజమ్మ, ఆర్యసమాజ్ నాయకులు కనకప్ప, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు విఘ్నేశ్వర్‌రెడ్డి, మాజీ జడ్పీటిసి అరవింద్‌కుమార్, మాజీ ఎంపిటిసి హనుమంతు, ఉపాధ్యాయులు దుంప నర్సింగప్ప, భాస్కర్, కరుణాకర్, కృష్ణ, నరసింహ, బన్నీష్ పాల్గొన్నారు.

## వికలాంగుల సంక్షేమమే లక్ష్యం

■ వికలాంగుల సంఘం జిల్లా అధ్యక్షులు చంటి

**గద్వాల అక్టోబర్ 22 ప్రభాతవార్త:** జోగులాంబ గద్వాల జిల్లా దివ్యాంగుల అధ్యక్షుడు టెంకాయల చంటికి 18వ వార్డు ప్రజలు, వికలాంగులు మంగళవారం జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. జోగులాంబ గద్వాల జిల్లా దివ్యాంగుల అధ్యక్షుడు చంటి దివ్యాంగుల కోసం అనేక పోరాటాలు చేసి తమ హక్కులను తమకు దక్కే విధంగా పోరాడిన చరిత్ర చంటికి ఉన్నదని దివ్యాంగులు అన్నారు. జిల్లాలో పూర్తిస్థాయిలో దివ్యాంగులు అయిన వారికి ప్రైవేట్ స్వచ్ఛంద సంస్థల ద్వారా ఎలక్ట్రికల్ ట్రై సైకిల్ బ్యాటరీ సిస్టంతో ఉన్న వాటిని అందించి వందల సంఖ్యలో దివ్యాంగులకు అందించిన చరిత్ర చంటిది. తాను నివాసం ఉంటున్న పాత హౌసింగ్ బోర్డు కాలనీలో సొంతంగా వార్డు అభివృద్ధి కోసం పాటు పడుతున్నారు. అనేక స్వచ్ఛందంగా కార్యక్రమాలు చేపడుతున్న సందర్భంలో అందరి మన్ననలు పొందుతున్న టెంకాయల చంటికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ టెంకాయల చంటి ముందు ముందు కూడా మరెందరో మన్ననలు పొందాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ చంటికి మరొకసారి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ఆయురారోగ్యాలతో ఉండాలని మనస్ఫూర్తిగా భగవంతుని కోరుకుంటున్నామని వికలాంగులు అన్నారు.

## ముడా చైర్మన్ ప్రమాణ స్వీకార మహోత్సవానికి రండి

మొదటి పేజీ తరువాయి భాగం..

ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని ఆహ్వానించారు. ఈ సందర్భంగా ముడా చైర్మన్‌లక్ష్మణ్‌యాదవ్‌కు మంత్రులు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేతోపాటు మహబూబ్‌నగర్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రి ఉన్నారు.

## డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం..

మొదటి పేజీ తరువాయి భాగం..

ప్రతి ఒక్కరు సహకరించాలని ఆమె కోరారు. అనంతరం యాంటీ డ్రగ్స్‌పై విద్యార్థులు, యువత, ఉపాధ్యాయులు అధికారులతో ప్రతిజ్ఞ చేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాల సంస్థ చైర్మన్ వార్ల విజయ్‌కుమార్, డిఆర్‌డిఓ మొగులప్ప, కోస్గి ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులు, డ్రగ్స్ వాడటం వల్ల కలిగే నష్టాలను వివరించారు. యాంటీ డ్రగ్స్‌పై చేపట్టిన సంతకాల సేకరణలో కలెక్టర్, ఎస్పీ పుర ప్రముఖులు సంతకాలు చేశారు. అనంతరం మాదకద్రవ్యాలు నిరోధం (సే నో టు డ్రగ్స్)పై విద్యార్థుల అవగాహన ర్యాలీని జిల్లా కలెక్టర్, ఎస్పీ జెండా ఊపి ప్రారంభించారు. స్థానిక శివాజీ చౌక్ నుంచి రామాలయం వరకు కలెక్టర్, ఎస్పీ విద్యార్థులతో కలిసి ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో కోస్గి సిఐ దస్రునాయక్, ఎస్సై బాల్‌రాజ్, తహసిల్దార్ బక్క శ్రీనివాసులు, మార్కెట్ చైర్మన్ భీమప్ప, వైస్ చైర్మన్ గిరిప్రసాద్‌రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు భీమ్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి, ఎంపిడిఓ శ్రీధర్, ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సంఘాల జైపాల్ రెడ్డిని పరామర్శించిన మాజీ మంత్రి



సంఘాల జైపాల్‌రెడ్డిని పరామర్శించిన మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

**గద్వాల, అక్టోబరు 22, ప్రభాతవార్త:** జోగులాంబ గద్వాల జిల్లా నియోజకవర్గం గద్వాల మండలం సంగాల గ్రామానికి చెందిన జైపాల్ రెడ్డి తల్లి మృతి చెందటంతో, వెంటనే విషయం తెలుసు కున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి స్వగృహానికి, వారి కుటుంబ సభ్యులను పరామర్శిం చారు. మాజీ మంత్రి వెంట బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు హన్మంత్ నాయుడు, పార్టీ సీనియర్ నాయకులు అంగడి బస్వరాజు, మాజీ గ్రంథాలయ చైర్మన్ పటేల్ విష్ణువర్ధన్ రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, మోనేష్, ఎస్.రాము, తిమ్మప్ప గౌడ్, గంగాధర్, కామేశ్, తదితరులు పాల్గొన్నారు.

## భాష కుటుంబాన్ని పరామర్శించిన కళ్యాణ్‌రావు

**చిన్నంబావి, అక్టోబరు 22 ప్రభాతవార్త:** మండలంలోని అయ్యవారిపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త పెద్ద భాష అనారోగ్యంతో మృతి చెందడం జరిగింది. విషయం తెలుసుకున్న చిన్నంబావి కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు కొత్త కళ్యాణ్‌కుమార్‌రావు మృతుడు పెద్దభాష పార్థీవ దేహానికి నివాళులర్పించి వారి కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను కలిసి ధైర్యాన్ని అందించి, పిల్లల చదువులకు, కుటుంబ సభ్యులకు అండగా ఉంటానని కొత్త కళ్యాణ్‌కుమార్ రావు కుటుంబ సభ్యులకు భరోసానిచ్చారు. కార్యక్రమంలో కొత్త కళ్యాణ్‌కుమార్ వెంట చిన్నంబావి మండల అధ్యక్షుడు బి.చంద్రశేఖర్‌యాదవ్, మాజీ ఉపసర్పంచ్ కృష్ణ, మల్లయ్య, జాఫర్, విభూషణ్, యూత్ కాంగ్రెస్ ప్రకాష్, రమేష్ పాల్గొన్నారు.

## జడ్జికి ఘన వీడ్కోలు... మరో జడ్జికి ఘన స్వాగతం



**నారాయణపేట టౌన్, అక్టోబరు22 ప్రభాతవార్త:** నారాయణపేట కోర్టు కాంప్లెక్స్‌లో మంగళవారం బదిలీ అయిన జడ్జికి న్యాయవాదులు ఘనంగా వీడ్కోలు పలికి బదిలీపై ఇక్కడికి వచ్చిన జడ్జికి ఘన స్వాగతం పలికారు. నారాయణపేట సీనియర్ సివిల్ జడ్జి జి. శ్రీనివాస్ నిర్మల్ కోర్టుకు బదిలీ అయ్యారు. ఆయనను బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. అలాగే సీనియర్ సివిల్ జడ్జిగా ఇక్కడికి వచ్చిన వింధ్యానాయక్‌ను అలాగే సన్మానించి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో జడ్జి జాకియా సుల్తానా, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దామోదర్‌గౌడ్, ఉపాధ్యక్షుడు నందు నామాజీ, ప్రధాన కార్యదర్శి చెన్నారెడ్డి, కార్యదర్శి భీంరెడ్డి, సీనియర్ న్యాయవాదులు మనోహర్‌రెడ్డి, డి. వెంకట్‌రెడ్డి, న్యాయవాదులు పిపి ఆకుల బాలప్ప, సలీం, నారాయణ, సతీష్‌గౌడ్, నర్సింహులు, కూర్మన్న, నాగేశ్వరి పాల్గొన్నారు.

## విద్యుత్ శాఖ డిఈని సన్మానించిన బికెఎస్ నాయకులు

**నారాయణపేట టౌన్, అక్టోబరు 22 ప్రభాతవార్త:** నారాయణపేట విద్యుత్ శాఖ డీఈ శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా మంగళవారం నారాయణపేట జిల్లా భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. సన్మానించిన వారిలో బికెఎస్ నాయకులు రాష్ట్ర సభ్యులు గజేంద్రగౌడ్, నరెందర్‌రెడ్డి, వేణుగోపాల్, రాష్ట్ర జోనల్ కార్యదర్శి వెంకోబా, ఆకుల వెంకటప్ప, విశ్వనాథ్‌రెడ్డి, ఆంజనేయులు యాదవ్, అనంతరెడ్డి, ప్రభువు మిస్కిన్, బాలప్ప, శరణమయ్యప్ప, మహిపాల్‌రెడ్డి, సింగారం నరసింహులు, బుర్ర బసప్ప, నరసింహ గొడుగు, లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.

## హలో మాల.. ఛలో నాగర్‌కర్నూల్

**చిన్నంబావి, అక్టోబరు 22 ప్రభాతవార్త:** మాల కులంపై తప్పుడు ప్రచారం చేయడం మంచిది కాదని, అనాది నుంచి మాలలు అంటరానితనాన్ని ఎదుర్కొంటున్నారని వారిని వేరుచేసి మాట్లాడడం పద్ధతి కాదని అన్నారు. మంగళవారం బెక్కెం గ్రామంలో హలో మాల ఛలో నాగర్‌కర్నూల్ ఈనెల 27న ఆదివారం బహిరంగ సభకు సంబంధించిన వాల్ పోస్టర్లు బెక్కెం పెద్ద బిల్కులో మాల మహానాడు అన్నలదాస్ రాజేందర్ ఆధ్వర్యంలో వాల్‌పోస్టర్ విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణతో దళిత ఉప కులాలు నష్టపోతాయని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన మంత్రుల కమిటీ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీల స్థితిగతులపై పూర్తి అధ్యయనం చేసి వెనుకబడిన కులాలకు ప్రత్యేకంగా గుర్తించి అభివృద్ధి ఏర్పాటు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. మాల, మాల ఉపకులాలకు జనాభా నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్లు, కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 27న నిర్వహించే ఛలో నాగర్‌కర్నూల్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గోపాల్, వెంకటస్వామి, నరసింహ, రవి, శరత్, లోకేష్, సత్యనారాయణ, మూర్తి, రాజు, మనోజ్ పాల్గొన్నారు.

## జూరాల గేట్లు మూసివేత

**మహబూబ్‌నగర్ బ్యూరో, అక్టోబరు 22, ప్రభాతవార్త:** ఉమ్మడి పాలమూరు వరప్రదాయిని జూరాల డ్యాంకు వరద పూర్తిగా తగ్గుముఖం పట్టింది. కర్ణాటక ఎగువ ప్రాంతం నుంచి వరద బంద్ అయిన కారణంగా మంగళవారం రాత్రి 9గంటలకు జూరాల ప్రాజెక్టుకు గేట్లను మూసివేశారు. మంగళవారం 6గంటలకు అందిన సమాచారం మేరకు జూరాలకు 64,000 క్యూసెక్కుల వరద వచ్చి చేరగా 6గేట్ల ద్వారా 64816 క్యూసెక్కులు దిగువకు వదిలారు. రాత్రి 9గంటల సమాచారం మేరకు ఇన్‌ఫ్లో 48వేల క్యూసెక్కులు చేరగా డ్యాం అధికారులు గేట్లు మూసివేశారు. జూరాలలో పూర్తి స్థాయి నీటి మట్టం 9.657 టీఎంసీలకు గానూ ప్రస్తుతం 5.262టీఎంసీల నీరు నిల్వ ఉన్నది. జూరాల నుంచి నెట్టెంపాడు 750క్యూసెక్కులు, ఎడమ కాలువకు 1140, కుడి కాలువకు 720క్యూసెక్కులు, ఆర్డీఎస్ లింక్ కెనాల్‌కు 50క్యూసెక్కులు విడుదల చేశారు. జూరాల నుంచి 41845 క్యూసెక్కులు అవట్‌ఫ్లో నమోదు అయింది.

## లోన్ వచ్చిందంటూ..మోసం

- ఫోన్ పేకు రెక్వెస్ట్ పంపి..ఖాతాల్లో రూ.1.75లక్షలు మాయం
- లబోదిబోమంటున్న బాధితులు.. స్టేషన్‌లో ఫిర్యాదు

**జడ్చర్ల, అక్టోబరు 22, ప్రభాతవార్త:** సైబర్ నేరగాళ్లు రోజుకో రంగు మారుస్తూ కొత్త వేశం వేసుకుంటున్నారు. ప్రభుత్వ పథకాల పేరుతో మోసాలకు ప్లాన్ వేస్తున్నారు. మహాలక్ష్మి పథకం కింద లోన్ వచ్చిందంటూ మాయమాటలు చెప్పి లక్షా75వేల రూపాయలు కాజేసిన ఘటన మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే..జడ్చర్ల మండలం గంగాపూర్‌కు చెందిన చెన్నకేశవులుకు గుర్తు తెలియని నెంబర్ నుంచి ఫోన్ రావడంతో ఎత్తి మాట్లాడగా మహాలక్ష్మి గ్రూప్ నుంచి లోన్ వచ్చిందని తెలిపారు. బ్యాంక్ వివరాలు చెబితే అకౌంట్‌లో డబ్బులు వేస్తామని చెప్పారు. విషయం అర్థం కాకపోవడంతో చెన్నకేశవులు ఫోన్ మాట్లాడమని పక్కనే ఉన్న వారికి ఇచ్చాడు. భూత్పూర్‌కు చెందిన మల్లేశ్‌కు తన అకౌంట్ నెంబర్ అతను పేమెంట్ రెక్వెస్ట్ పంపారు. వారు చెప్పింది విని అకౌంట్ నెంబర్‌ను ఫోన్ చేసిన వ్యక్తికి చెప్పారు. వాళ్లు ఫోన్‌పేలో వీరు డబ్బులు పంపాల్సింది పోయి అమౌంట్ రెక్వెస్ట్ పంపారు. వీరు పే నౌ కొట్టగానే అకౌంట్ నుంచి రూ.1.75లక్షలు పోయాయి. విషయం అర్థం అయ్యాక తీరా ఖంగుతిని బాధితులు జడ్చర్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఫోన్ చేసి ఎవరైనా లోన్ వచ్చింది..డబ్బులు వస్తాయంటే నమ్మవద్దని ఎస్సై శివానంద్ సూచించారు. ఇతరులకు ఖాతా నెంబర్, ఏటీఎం పిన్ నెంబర్ తెలుపవద్దని సూచించారు.

## మాదక ద్రవ్యాల నిషేధాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

### ఆర్డీఓ మధుమోహన్



మాట్లాడుతున్న ఆర్డీఓ మధుమోహన్

**నారాయణపేట టౌన్, అక్టోబరు22 ప్రభాతవార్త:** జిల్లాలో మాదకద్రవ్యాల నిషేధాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఆర్డీఓ మధుమోహన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం జిల్లా కలెక్టరేట్‌లోని విసి హాల్‌లో మాదకద్రవ్యాల నిషేధం (యాంటీ నార్కోటిక్)పై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆర్డీఓ మాట్లాడుతూ జిలల్లాలో గంజాయి సాగు జరగకుండా వ్యవసాయశాఖ అధికారులు పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలోని అన్ని జూనియర్, డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన యాంటీ డ్రగ్ కమిటీల నేతృత్వంలో మాదక ద్రవ్యాల నిషేధంపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలోని పాలిటెక్నిక్, ఇంజనీరింగ్, జూనియర్, డిగ్రీ జూనియర్ కళాశాలలో మాదక ద్రవ్యాల నిషేధంపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. సిఐ శివశంకర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని జూనియర్, డిగ్రీ కళాశాలలో యాంటీ డ్రగ్ కమిటీలను ఏర్పాటు చేయడంజరిగిందని తెలిపారు. అలాగే గంజాయి సాగు, సరఫరాకు సంబంధించి జిల్లాలో నమోదైన కేసుల గురించి వివరించారు. ఇకపై జిల్లాలో మరెక్కడ ఇలాంటి కేసులు నమోదు కావడానికి వీలు లేకుండా రెవెన్యూ, వ్యవసాయశాఖ, పోలీస్, ఎక్సైజ్‌శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆర్డీఓ కోరారు. అధికారులు మాదకద్రవ్యాల నిషేధంపై క్షేత్రస్థాయిలో నిఘా పెట్టాలని ఆయన చెప్పారు. జిల్లాలో గంజాయి సాగును పూర్తిగా నిషేధించాలన్నారు. ప్రతి ఒక్కరు సామాజిక బాధ్యతతో మాదక ద్రవ్యాల నిషేధిత జిల్లాగా నారాయణపేటను మార్చాలని, అందుకోసం సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ మేఘాగాంధీ, జిల్లా వ్యవసాయ శాఖఅధికారి జాన్ సుధాకర్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ విజయ్, వైద్యశాఖ ప్రోగ్రాం అధికారి రాఘవేందర్‌రెడ్డి, సత్యనారాయణ, డిఐఈఓ సుదర్శన్ పాల్గొన్నారు.

## శేర్‌పల్లి పాఠశాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకుందాం!

- దాతల సహకారం ఉన్న గ్రామం ఎప్పటికైన అభివృద్ధి చెందుతుంది: వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి
- అదనపు గదుల నిర్మాణాన్ని తక్షణమే చేపట్టాలంటూ ఆదేశించిన ఎమ్మెల్యే





**పెబ్బేరు అక్టోబరు 22 ప్రభాతవార్త:** పెబ్బేరు ఉమ్మడి మండలం శేంపల్లి గ్రామ ప్రాథమిక పాఠశాలను అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. గ్రామస్తుడు అయినటువంటి నాగరాజు తన సొంత నిధులతో పాఠశాలలో ఏర్పాటు చేసిన తాగునీటి శుద్ధ జల కేంద్రాన్ని మంగళవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు డప్పు వాయిద్యాల మధ్యన బాణాసంచా కాల్చుతూ రకరకాల పూల వర్షాన్ని కురిపించి ఘనంగా స్వాగతం పలికారు. పాఠశాలలో సరైన గదులు లేకపోవడం వల్ల విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని గ్రహించిన ఎమ్మెల్యే అత్యవసరంగా రెండు గదులను వెంటనే నిర్మించాలని అందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు తాను చేస్తానని గ్రామస్తులు సూచించారు. విద్యాభివృద్ధికి పెద్దపీట వేసిందని ఈ క్రమంలోనే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషనల్ హబ్కు శ్రీకారం చుట్టిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. దీంతో రాష్ట్రంలో అంగన్వాడీ కేంద్రాలను బలోపేతం చేసి మూడవ తరగతి నుండి డిగ్రీ వరకు అత్యుత్తమ విద్యను అందించేందుకు ఈ ఎడ్యుకేషనల్ హబ్కులు ఉపయోగపడతాయని ఆయన వివరించారు. ఈ సందర్భంగా పాఠశాలలో సిద్దని డీజిల్ కేంద్రాన్ని ఏర్పాటు చేసిన నాగరాజును ఆయన ప్రత్యేకంగాఅభినందించారు. గ్రామంలోని పాఠశాల అభివృద్ధికి పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థుల సహాయ సహకారాలు ఉండాలని తనవంతు సహాయ సహకారాలు ఎప్పటికి అందిస్తానని ఎమ్మెల్యే గ్రామస్తులకు సూచించారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల అధ్యక్షురాలు భారతి, ఎంపీడీఓ రవి నారాయణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు, మండల నాయకులు శ్రీహరి రాజు, బీరం రాజశేఖర్‌రెడ్డి గ్రామ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కరెంటు బిల్లు ప్రభుత్వమే భరించాలి

- మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

**మక్తల్, అక్టోబరు 22 ప్రభాతవార్త:** నియోజకవర్గంలోని పుంజనూరు ఎత్తిపోతల పథకం ద్వారా రైతులకు అందుతున్న సాగు నీటి వినియోగానికి సంబంధించిన కరెంటు బిల్లులను ప్రభుత్వమే భరించాలని మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలో ఆయన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ గత ప్రభుత్వాలు ఎన్నడు కరెంట్ బిల్లు భారం రైతులపై మోపలేదని ఆయన అన్నారు. కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం పుంజనూర్ ఎత్తిపోతల పథకం కరెంటు బిల్లు చెల్లించాలని రైతులకు నోటీసులు ఇవ్వడం ఎంత వరకు సమంజసమని అన్నారు. ముడుమాల్ ఎత్తిపోతల పథకం శ్రీ రాఘవేంద్ర లిఫ్ట్ ఇరిగేషన్ వవారికి కరెంటు బిల్లు చెల్లించాలంటూ 01.07.2024 నాడు రూ.2 కోట్ల 43 లక్షల 338 లతో ఒక నోటీసు జారీ చేయడంతోపాటు 01.10.2024 నాడు రూ. 2 కోట్ల 63 లక్షల 17512 చెల్లించాలంటూ మరో నోటీసు జారీ చేయడం చూస్తుంటే రైతులపై ప్రభుత్వం కరెంటు బిల్లు మోపి చివరకు లిఫ్ట్‌లను బంద్‌చేసి రైతులను ఆగం చేయాలని రేవంత్‌రెడ్డి సర్కార్ ఆలోచన చేస్తుందన్నారు. గతంలో ఏ ప్రభుత్వం లిఫ్ట్‌లకు కరెంటు బిల్లు చెల్లించాలంటూ నోటీసులు ఇవ్వలేదని, ప్రస్తుతం తెలంగాణలో మార్పు కోసం నూతనంగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం రైతు నెత్తిన కరెంటు బిల్లు కట్టాలంటూ నోటీసులు ఇవ్వడం చూస్తుంటే గత ప్రభుత్వంలో రైతులకు రావాల్సిన రైతుబంధును సైతం మింగేసి నేడు కరెంటు బిల్లుతో రైతులను కష్టాలపాలు చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు చిన్న హనుమంతు, గుర్లపల్లి గాల్‌రెడ్డి, బిఆర్‌ఎస్ యువజన అధ్యక్షుడు నర్సింహారెడ్డి, ఈశ్వర్ యాదవ్, స్వామి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

## గద్వాల రైతు సదస్సు పోస్టర్లను ఆవిష్కరించిన ఎమ్మెల్యే



రైతు సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరణ చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి

**గద్వాల, అక్టోబరు 22, ప్రభాతవార్త:** గద్వాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపుకార్యాలయం నందు ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి రైతు సదస్సు పోస్టర్ ను మంగళవారం ఆవిష్కరణ చేశారు. ఈ నెల 26 శనివారం వ్యవసాయ మార్కెట్ కమిటీ, గద్వాల రైతు సేవా సమితి ఆధ్వర్యంలో గద్వాల రైతు సదస్సు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఇట్టి కార్యక్రమానికి గద్వాల నియోజకవర్గం లోని అన్ని గ్రామాల రైతు సోదరులు, ప్రజలు , సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున్న అధిక సంఖ్యలో పాల్గొని రైతు సదస్సు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ నెల న ఉదయం 9:00 నుండి సాయంత్రం 6:00 వరకు వ్యవసాయ మార్కెట్ యార్డ్ గంజిలో ఈసదస్సు కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యమాన్ని ఉమ్మడి జిల్లా జడ్పీ చైర్మన్ బండారి భాస్కర్, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ జంబు రామన్ గౌడ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత గడ్డం కృష్ణారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ బాబర్, నాయకులు సుదర్శన్ రెడ్డి, రామకృష్ణ నాయుడు, చక్రధర్ రావు చంద్రశేఖర్, వంట భాస్కర్, బహదూర్‌రెడ్డి, గంట రమేష్, శ్రీరామ్‌రెడ్డి, తిరుమల్‌రెడ్డి, తిక్క రెడ్డి, శేఖర్ వీరేష్, ప్రైవేట్ కళాశాల గౌరవ అధ్యక్షులు భాస్కర్‌రెడ్డి, రంగారెడ్డి, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బ్యాంక్ ఖాతాలకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయాలి

### పిఆర్‌టియు జిల్లా అధ్యక్షుడు జనార్ధన్‌రెడ్డి



వినతి పత్రం సమర్పిస్తున్న దృశ్యం

**నారాయణపేట టౌన్, అక్టోబరు 22 ప్రభాతవార్త:** జిల్లాలోని అన్ని పాఠశాలలకు బ్యాంక్ ఖాతాల కోసం ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయాలని పిఆర్‌టియు నారాయణపేట జిల్లా అధ్యక్షుడు వై. జనార్ధన్‌రెడ్డి కోరారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు అన్ని ఉబెర్ బ్యాంకు ఖాతాలు పాఠశాల యాజమాన్య కమిటీ, మధ్యాహ్న భోజనం, అమ్మ ఆదర్శ పాఠశాలల ఖాతాలు కేవలం నారాయణపేట కెనరా బ్యాంకులోనే ఉండడం వల్ల బాగా ఇబ్బందిగా ఉందని తెలిపారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ సిబ్బంది కొరత ఉందని తెలిపారు. వెంటనే బ్యాంకు ఎజిఎంతో సంఘం నాయకులు మాట్లాడారు. వెంటనే వారు ఒక సిబ్బందిని నియమించి సమస్యను పరిష్కారం చేయనున్నట్లు తెలిపారన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు వై. జనార్ధన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పి. వెంకట్‌రెడ్డి, నారాయణపేట మండలం అధ్యక్షులు రఘువీర్, కృష్ణ, అధ్యక్షులు శేఖర్ పాల్గొన్నారు.

## జాతర గోడ పత్రికను ఆవిష్కరించిన గద్వాల ఎమ్మెల్యే



జాతర గోడ పత్రికను ఆవిష్కరణ చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి

**గద్వాల, అక్టోబరు 22, ప్రభాతవార్త:** త్వరలో జరగబోయే కె.టి దొడ్డి మండల పరిధిలోని పాగుంట, వెంకటాపురం గ్రామంలో శ్రీశ్రీశ్రీ పాగుంట లక్ష్మీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు జాతరపోస్టర్లు ఆహ్వానం. పత్రిక ను ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించడం జరిగిందన్నారు. ముందుగా ఈవో ఎమ్మెల్యే కి శాలువా కప్పి పూలమాల తో ఘనంగా సత్కరించారు. వచ్చే నెల శుక్రవారం కళ్యాణ మహోత్సవం, 2 శనివారం రథోత్సవ మహోత్సవం, 3న ఆదివారం స్వామివారి పల్లకి సేవ ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా శ్రీ పాగుంట లక్ష్మీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించాలన్నారు. వివిధ రాష్ట్రాల నుండి వచ్చే భక్తులకు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని రకాల సౌకర్యాలను కల్పించాలన్నారు. బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ విజయ్, మాజీ జెడ్పిటిసి రాజశేఖర్, మాజీ సర్పంచ్ ఆంజనేయులు, నాయకులు ఆనంద్ గౌడ్, సతీష్, నవీన్‌రెడ్డి, చంద్రశేఖర్, రాముడు, నర్సింహులు, ఈవో పురేందర్, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు వైద్య పరీక్షలు



పాఠశాలలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

**భూత్పూర్, అక్టోబరు 22 ప్రభాతవార్త:** భూత్పూర్ పట్టణంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఆర్‌బీఎస్‌కె మహబూబ్‌నగర్ వైద్య సిబ్బందిచే పాఠశాలలో చదివే బాలబాలికలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో పాఠశాలలోని 13మంది విద్యార్థులకు కంటి, పంటి, వినికిడి, రక్తహీనత సమస్యలు ఉన్నట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ విద్యార్థులను వారి తల్లితండ్రుల సహాయంతో మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో సంప్రదించి తగు చికిత్స తీసుకోవాలని సూచించారు. పాఠశాలలో చదివే ఐదో తరగతి విద్యార్థులకు హిమోగ్లోబిన్ రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బిఎస్‌కె డాక్టర్ ఫయాజ్, డాక్టర్ హజీరా, పార్మాసిస్ట్ ప్రవళిక, ఎఎన్‌ఎం మేరితో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దస్తయ్య, ఉపాధ్యాయుడు యాదయ్య పాల్గొన్నారు.

## 48 గంటల్లో రైతుల ఖాతాలో ధాన్యం డబ్బులు

మొదటి పేజీ తరువాయి భాగం..

తరుగు పేరిట క్వింటాల్‌కు ఐదారు కిలోలు రైతులకు నష్టం కల్గించారని విమర్శించారు. తమ ప్రభుత్వం రైతులకు ఎలాంటి ఇబ్బంధులు కల్గ కుండా చర్యలు చేపట్టి రైతుల పట్ల తమ ప్రభుత్వ చిత్తశుద్ధిని ప్రకటిస్తోందని అన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకుఎలాంటి అవకతవకలకు పాల్పడినా, ఎక్కడైనా అధికారులు, సిబ్బంధి తప్పిదంతో రైతులు ఇబ్బంధులు పడినా, బిల్లుల చెల్లింపులో జాప్యం చేసినా కఠిన చర్యలు తప్పవని ఎమ్మెల్యే జీఎంఆర్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ కదిరే అశోక్‌రెడ్డి, భూత్పూర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు లిక్కినవీన్‌గౌడ్, మాజీ ఎంపిపికదిరే శేఖర్‌రెడ్డి, భూత్పూర్ మండల కాంగ్రెస్ ఓబీసీ సెల్ అధ్యక్షుడు జైదు శ్రీనివాసులు, డీసీసీ ఉపాధ్యక్షుడు నర్సింహ్మారెడ్డితో పాటు నాయకులు హరియా నాయక్, ప్రతాప్‌రెడ్డి, ఆగిరి రవి, కరుణాకర్‌గౌడ్, దెంది లక్ష్మీకాంత్‌రెడ్డి, వంశీ, సింగిల్ విండో సీఈఓ రత్నయ్య పాల్గొన్నారు.

## వసతులపై గళమెత్తిన జేఎన్టీయూ విద్యార్థులు

మొదటి పేజీ తరువాయి భాగం..

ప్రారంభమై మూడు సంవత్సరాలు గడుస్తున్నా కళాశాలలో మౌళిక వసతులు కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు విమర్శించారు. ధర్నా జరుగుతుందని తెలుసుకున్న ఆర్డిఓ పద్మావతి, వనపర్తి డిఎస్పి వెంకటేశ్వరరావు కాలేజ్ విద్యార్థుల సమస్యలు విని సమస్యలను సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరగా పూర్తి చేస్తాం అని విద్యార్థులకు హామీ ఇచ్చారు.

**ఇందు, జేఎన్టీయూ కాలేజ్ విద్యార్థిని :** మా హాస్టల్‌లో నాసిరకం సరుకులతో వంటలు వండి పెడుతున్నారు. మేం తినలేక ఇబ్బందులకు గురిఅవుతున్నాం కొన్ని నెలల క్రితం నాసిరకంగా ఉన్న సరుకులు అన్నం తెచ్చి పెట్టడం వల్ల ఫుడ్ పాయిజన్ ఐ చాలా ఇబ్బందులకు గురి అవ్వడం జరిగింది. మా యొక్క ఆవేదనను ప్రభుత్వ అధికారులు మా కాలేజ్ ప్రిన్సిపాల్ అర్థం చేసుకోలేకపోతున్నారు అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఆదిశేషులు, జేఎన్టీయూ కాలేజ్ విద్యార్థి :** మా కళాశాల సమీపంలో బస్సు నిలిపేందుకు ఆర్టీసీ సిబ్బంది నిరకరిస్తున్నారు. మాకు తాత్కాలిక వసతి కల్పించిన భవనంలో మరుగు దొడ్లు లేక విద్యార్థినిలు ఇబ్బందులు పడుతున్నాం, కళాశాలలో ఉన్న సమస్యలను పరిష్కరించే వరకు ధర్నాలో కూర్చుంటాం, మేం ప్రశ్నిస్తే సస్పెండ్ చేస్తారన్న భయంతో ఇన్నాళ్లు సమస్యలతో విద్యను కొనసాగిస్తున్నామని, ఓపిక నశించి గాత్యంతరం లేక నిరసన కార్యాలయం చేపడుతున్నామని విద్యార్థులు తెలిపారు.

**విద్యార్థుల ధర్నాకు రాజకీయ పార్టీలో మద్దతు..** విద్యార్థులు చేపట్టిన ధర్నాకు ఏబీవిపి విద్యార్థి సంఘం, బీజేపీ పార్టీ మద్దతు తెలిపింది. వనపర్తి జిల్లా కలెక్టర్, జేఎన్టీయూ ఉన్నత అధికారులు వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలి సమస్యలను త్వరగా తీర్చకపోతే మళ్లీధర్నాకు కూర్చోవడానికి వెనకాడంఅని డిమాండ్ చేశారు.



రోడ్డుపై కూర్చుని ధర్నా చేస్తున్న జేఎన్టీయూ కాలేజ్ విద్యార్థులు